


'మీరు సొంతం నా మాట వినకుండానే 'అలాకాదు, వీల్లేదు' అనేస్తే ఎలా?" ఎర్రబడిన ముఖంతో అభిమానంగా అంది అరుణ.

చంద్రం భార్యవైపు చిరుకోపంతో చూశాడు. "ఇంకా ఎంతసేపు వినమంటావ్? ఉపోద్ఘాతంలోనే నీ ఆలోచనేమిటో తెలిసిపోతుంటే."

"వింత ఏమిటో కానీ, నాలో ఆలోచన అనేది అంకురించకముందే అదేమిటో మీ మనసు యిట్టే గ్రహించేస్తుంది. క్రిందటి జన్మలో బహుశా మన స్తత్త్వశాస్త్రం మీ అభిమాన విద్య అయివుంటుంది. పొరపాటుగా యీ జన్మలో ఇంజనీరు అయిపోయారు." నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అంది.

నీ మెప్పికోలుకి నేనేం పొంగిపోవటం లేదులే – అన్నట్టు చంద్రం ముఖం తిప్పుకున్నాడు. దూరంగా నిలబడివున్న అరుణ యిక లాభంలే – దన్నట్టు అతను కూర్చున్న మంచం దగ్గరగా వచ్చింది. భుజంమీద చెయి వేసి అనునయంగా, "నా మనసులో మాట మీరెంత గ్రహించగలిగినా ఈసారి నా నోటితో చెప్పబోయేదికూడా కాస్త విని తీరాలి," అంది.

భుజంమీద పడిన చేతిని విసురుగా తోసేశాడు చంద్రం. ముఖం చిరాగ్గా, అప్రియంగా పెట్టుకున్నాడు.

అనుకోకుండా అతను చూపిన యీ నిర్లక్ష్యానికి అరుణ వదనం చిన్నబోయింది. అయినా పట్టువిడవకుండా అడిగింది. "వెళ్ళే రోజు, వచ్చేరోజు కలుషకుని చూసినా పట్టుమని పదిరోజులు లేవు. యింత మాత్రానికే మీరు..."


కూర్చున్న చంద్రం మంచంమీదనుంచి హఠాత్తుగా లేచిపోవటంతో మధ్యలోనే ఆగిపోయింది.

''అతను మారు మాట్లాడకుండా స్టాండ్ దగ్గిరకు వెళ్ళి బట్టలు మార్చుకోసాగాడు. వెనకనుంచి నిష్ఠూరంగా అంది అరుణ. "బాబాయి వుత్తరం మీరు స్వయంగా చూసి కూడా యిలా మాట్లాడటం నాకేం బాగా లేదు. ఆడదిక్కులేని ఆ యింట్లో నేను వెళ్ళేవరకూ ఏ పనీ జరగదన్న సంగతి నాకొక్కదానికే తెలుసు."

''అబ్బ! నిజంగా ఏం ఆడవాళ్ళు! ఇంత చిత్రమైన జాతి యీ సృష్టిలో యింకోటి ఏదీ లేదేమో అన్పిస్తుంది. ఆర్నెల్ల క్రితంవరకూ ఆయన పేరు చెవితేనే మండిపడే పెద్దమనిషివి. ఇవాళ ఇంత ఆప్యాయత ఒలకబోయటం చూస్తే...''

భర్త వెటకారానికి అరుణ కళ్ళల్లో రోషం తొంగిచూసింది. అదే యింకోసారి అయితే అంతెత్తున ఎగిరిపడి, 'నా యిష్టం. నా అభిప్రాయాలు నా మనసుకి నచ్చిన విధంగా గంటకో రకంగా కాదు, నిముషానికో రీతిగా, క్షణానికో తీరుగా మార్చుకుంటాను. మీకెందుకు? మధ్యలో మీరెవరు అడగటానికి,' అని నిలదీసేది.

కానీ యిప్పుడు పరిస్థితి వేరు. అసలే ఏ సాకు దొరుకుతుందా, పోట్లాట పెట్టుకుని



ప్రయాణం ఎగ్గొట్టేద్దామా అని చూస్తున్నాడు అతను. అలాటి అవకాశం యిచ్చే తెలివి తక్కువ మనిషేంకాదు తను.

అందుకే రోషం దాచుకుని నచ్చచెబుతున్నట్టుగా అంది: "ఇది మరీ బాగుంది. మనిషన్న తర్వాత మారకుండా ఎలా? కాలం మనమీద వెదజల్లిన సంఘటనలకి అనుగుణ్యంగా, వూసరవెల్లుల్లా రంగులు మార్చుకుంటూ పోకపోతే ఈ బ్రతుకు ఎంత దుర్భరం అవుతుందో మీ కేం తెలుసు? కొంతమంది వుంటా రనుకోండి బండ రాళ్ళలా ఎప్పటికీ ఒకేరకంగా.''

ఎంత జాగ్రత్తగా మాట్లాడా లనుకున్నా, అనుకోకుండా నోరుజారి ఎత్తిపొడుపు రానే వచ్చేసింది.

క్షణంసేపు పెదవులు బిగబట్టి చంద్రం వైపునుంచి ఎంత ఘోరమైన విమర్శ వినాల్సి వస్తుందో ననే భయంతో ఎదురుచూసింది.

బట్టలు వేసుకోవటం పూర్తి చేసిన చంద్రం, డ్రెస్సింగ్ టేబిల్‌మీద దువ్వెన కన్పించకపోవటంతో దానికోసము అటూ యిటూ వెతుకుతున్నాడు.

అరుణ నోటినుంచి అప్రయత్నంగా వెలువడిన యీ వ్యంగ్యం అతన్ని తాకిందో లేదో కానీ, సమాధానంగా జవాబు మాత్రం ఏమీ రాలేదు.

ఎదురుగుండా ఫాన్ పెట్టుకునే స్టూలు మీద వున్న దువ్వెనని తీసుకువెళ్ళి అతనికి అందించింది. అందిస్తూనే చెప్పింది. "అప్పట్లో ఆయనమీద నాకు పీకలవరకూ కోపం వున్నమాట నిజమే. ఆ మాట నే నేం కాదనటం లేదుగా. బాబాయ్ మన పెళ్ళికి ఒప్పుకోలేదు. పైనుంచి మీ పట్ల అమర్యాదగాకూడా ప్రవర్తించాడు. అప్పుడు మీ వ్యక్తిత్వం ఏమిటో, మీ రేమిటో ఆయనకి అర్థంకాలేదు. క్రమేపీ తెలుసుకున్నాడు. తెలుసుకుని మనసు మార్చుకున్నాడు. మిమ్మల్ని గుర్తించటం నేర్చుకున్నాడు. అంతటితో నేనూ నా స్వభావం మార్చుకున్నాను. ఇందులో తప్పేముంది."

అద్దంముందు నిలబడి తల దువ్వుకుంటున్న చంద్రం నోటినుంచి దీనికూడా సమాధానం రాలేదు.

"చెప్పండి. మాట్లాడరేం?"


"ఏం మాట్లాడమంటావ్?"

అరుణ చాలా సేపటినుంచీ బలవంతంగా తెచ్చిపెట్టుకున్న సహనం సడలిపోయింది. అసలు తను చెప్పేది ఆలకిస్తున్నాడో లేదో ననే అనుమానం వచ్చేసరికి ఆవేశం ముంచుకొచ్చింది. కోపం తాటిప్రమాణానికి లేచింది.

"నే నింతసేపూ వాగే దేమిటి? అసలు ఒక్కమాటలో తేల్చిచెప్పండి – నే నీ పెళ్ళికి వెళ్ళాలా? వద్దా?–"

"నువ్వేం నిర్ణయించుకున్నావు?" శాంతంగా అడిగాడు చంద్రం.

"నేను వెళ్ళటానికే నిశ్చయించుకున్నాను;" మొండిగా అనేసింది అరుణ.




కూర్చుని, కాలికి మేజోడు తొడుక్కోబోతున్న చంద్రం యీ మాట వినగానే దాన్ని దూరంగా విసిరేసి లేచి నిటారుగా నిలబడ్డాడు, భార్య ముఖంలోకి తీక్షణంగా చూస్తూ అడిగాడు. "అలాటప్పుడు మళ్ళీ నన్నడగటం దేనికీ? ఏకంగా బైలుదేరే ముందు చెబితే సరిపోయేదిగా. ఇలాటి పైపై మొహమాటాలన్నా, లేనిపోని మెహర్బానీలన్నా నాకు చెడ్డ అసహ్యం అన్న సంగతి నీకు తెలియదూ. వెళ్ళదల్చుకున్నదానివి నిక్షేపంగా వెళ్ళు. ఉండదల్చుకున్నన్నిరోజులు వుండు. నా కేం అభ్యంతరం లేదు," అంటూనే బూటు వేసుకునే ప్రయత్నం మానేసి గోడవారగా వున్న చెప్పులు తొడుక్కుని గబగబా బైటికి వెళ్ళిపోయాడు. మధ్యలో రెప్పపాటుకాలం ఆగి, "నేను వచ్చేసరికి పొద్దుపోతుంది. భోజనానికి నాకోసం చూడొద్దు," అనేసి వెళ్ళిపోయాడు.

అరుణ కళ్ళలో నీళ్ళు తిరిగినంత పనైంది. మంచంమీద నీరసంగా కూలబడింది. ఏమైంది యితనికి? ఎప్పుడు చూసినా సరదాగా, నవ్వుతూ, సరసంగా వుండే మనిషికి హఠాత్తుగా ఏ మొచ్చింది. తను తెచ్చిపెట్టుకున్న నమ్రత, ఈ సరసత్వం ఇదంతా అతన్ని ఒప్పించటానికే నని మొదటే గ్రహించేసిన అతను, సున్నితంగా రెచ్చగొట్టి వెళ్ళిపోయాడు.

అయినా భర్త అనవసరంగా, అకారణంగా యిలా ఎందు కింత మొండిపట్టుదల పడుతున్నాడో అసలుసంగతి తనకు తెలుసు. అభిమానధనుడైన అతను, మాటల్లో బైట పెట్టకపోయినా, ఆత్మీయత నిండిన తన అంతర్యం అమాత్రం గ్రహించలేడా! పెళ్ళి అయిన ఈ నాలుగు సంవత్సరాల్లో ఇద్దరూ ఒకళ్ళని వదిలిపెట్టి ఇంకోళ్ళు ఒక్కరోజు కూడా వుండలేదు. ఎక్కడికి వెళ్ళినా కలిసే వెళ్ళేవాళ్ళు. ఇద్దరిలో ఏ ఒకరికి సమయం, అవకాశం కుదరకపోయినా రెండోవారు మానేసేవారు. ప్రాణస్నేహితురాలి పెళ్ళికి రమ్మనమని శుభలేఖ వస్తే, భర్త కాఫీసులో శలవు దొరలేదని అరుణ మానేసింది. వంటరిగా నైనా సరే పెళ్ళికి వెళ్ళాలని ఎంతగానో అన్పించినా, అతని మనసు గ్రహించటంచేత పెదవి కదిపి అడగలేకపోయింది – ఆ విధంగా అదొక్కసారే కాదు, రెండు మూడుసార్లు వరసగా జరిగింది. యింకా ఎన్నిసార్లు జరిగేదోకూడా. కానీ హఠాత్తుగా అరుణ కీ మధ్య జ్ఞానోదయం అయింది. దాదాపు నెలరోజులక్రితం ఆంధ్రుల అభిమాన రచయిత్రి అయిన 'సంయుక్త' వ్రాసిన 'జీవితబాంధవ్యాలు' పుస్తకం చదూతుంటే అరుణదృష్టి ఒకపేజీలో మధ్యగా వున్న పంక్తుల మీద నిల్చిపోయింది. అందులో కథద్వారా రచయిత్రి చెప్పిన మాటలు: 'భార్యాభర్తలమధ్య సంబంధం అతిసున్నితమైంది. ఇద్దరినీ ఒకటిగా చేసే అనురాగసుధ నిత్యనూతనంగా పరిమళిస్తూ వుండాలంటే భార్యాభర్తలమధ్య అప్పుడప్పుడూ వియోగం చాలా అవసరం. ఎడబాటులో తీపి, దూరంగా వున్నప్పుడు కావాలి అని కోరుకునే ఆరాటం, ఎప్పటి

కప్పుడు కొత్తగా అన్పించేలా చేస్తాయి.'

అరుణ నవల సంగతి మర్చిపోయి చెంపన చెయి చేర్చుకుని దీర్ఘాలోచనలో పడిపోయింది. ఒకసారి, పెళ్లయిన నాలుగు సంవత్సరాలు తరిచితరిచి చూసుకుంది. ఎక్కడా యిద్దరి మధ్యా ఓ చిన్నియెడబాటులేదు. చంద్రం తల్లీ తండ్రీ చిన్నప్పుడే చనిపోయారు. అతనికి నా అనేవాళ్ళెవరూలేరు. స్నేహితుల దగ్గర మంచితనంతోనూ, తెలిసినవాళ్ళవద్ద మర్యాదతోనూ ఎలాగో అవస్థపడి ఇంజనీరింగ్ అయింది అన్పించుకున్నాడు. డిగ్రీ చేతికి వచ్చేసరికి వున్న పెంకుటిల్లు పోగా, రెండువేలరూపాయిల అప్పు మిగిలింది. అప్పిచ్చినవాళ్ళు తప్ప అతని యోగక్షేమం కనుక్కునేవాళ్ళు యింకెవరూలేరు. అరుణ తండ్రి కాన్సర్‌తో చనిపోతున్నానని తెలుసుకున్నప్పుడు తమ్ముడైన గోపాలాన్ని పిలిచి, ఆయనచేతికి ఆస్తినీ కూతుర్నీ భార్యనీ అప్ప చెప్పి తృప్తిగా ప్రాణం వదిలాడు. గోపాలం అన్నగారి మాటని వమ్ముచేయలేదు. వదినగారిని స్వంత తోబుట్టవులా, అన్నకూతుర్ని కన్న తండ్రికంటే మిన్నగా ఆదిరించాడు. నీతికీ నిజాయితీకీ మారుపేరయిన ఆయన, అరుణ ఆస్థిని అరుణకి యుక్తవయసు వచ్చేసరికి నాలుగింతలు అభివృద్ధి చేశాడు. గోపాలం భార్య పోయికూడా పదిపదిహేను సంవత్సరాలు అయింది. ఆయనకి ఒకే ఒకకొడుకు శంకరం. అరుణతల్లి సాధారణంగా మరిది ఎదుటకి వచ్చేదికాదు. అందుకే దాదాపు బుద్ధి తెలిసినప్పటినుంచీ అరుణ ఆ ఇంటికి ఆడపెత్తనం వహించింది. అరుణ కాలేజి చదువు ముగిస్తేగాని వివాహం తలపెట్టనని వదినగారికి ఖచ్చితంగా చెప్పేశాడాయన.

అరుణ కాలేజిచదువు ముగిసింది. గోపాలముగారు తీవ్రంగా వరాన్వేషణ ప్రారంభించారు. పుష్కలంగా వున్న ఆస్థితోపాటు అపరంజి బొమ్మలా వున్న అరుణకి అన్నివిధాలా యోగ్యుడైన వ్యక్తి దొరకాలంటే కొంచం కష్టమే అయింది. ఎన్ని సంబంధాలు చూసినా ఒకదానికీ, మరోదానికీ పొంతనలేక ఏదో ఒకలోటు కన్పించసాగింది. కూతురి పెళ్ళికోసం కలవరిస్తూనే తల్లి గుండె పోటువల్ల ఓరోజు హఠాత్తుగా మరణించింది.

తల్లిపోయిన కొత్తల్లో ఆ లోటుని మర్చిపోవటం కోసం అరుణ తరుచుగా స్నేహితురాలయిన వనజ యింటికి వెళ్ళూతూ వుండేది. వనజ కుటుంబానికి ఆప్తుడు చంద్రం. వనజకి చంద్రం అంటే సోదర భావం వుంది. ఇంజనీరింగు కోర్స్ ఆఖరి సంవత్సరంలో వున్న చంద్రం చివరిచివరికి డబ్బుకి మరీ యిబ్బందిపడుతున్నాడని వనజద్వారా తెలుసుకున్న అరుణ అతనికి తను సాయపడటానికి నిశ్చయించుకుంది. కానీ చంద్రం ఒప్పుకోలేదు. ఓ మాదిరి పరిచయంకూడా లేని వ్యక్తిదగ్గరనుంచి, అందులో ఆడపిల్ల దగ్గరనుంచి ఎంత విషమ పరిస్థితులైనాసరే సాయం తీసుకోలేనని నిర్మొహమాటంగా చెప్పేశాడు. అరుణకి మొదటి చూపులోనే అతనిపట్ల గౌరవం ఏర్పడింది. అది యీ సంఘటనతో అభిమానంగా మారి ఆత్మీయతగా వృద్ధిచెంద సాగింది. రానురాను అతనంటే ఓ విధమైన యిష్టం కలగటం, సాధ్యమైనంత ఎక్కువసేపు అతని సాన్నిహిత్యంలో గడపాలని మనసు వువ్విళ్ళూరటం అరుణ గుర్తించుకుంది. కలవారిపిల్ల, అందులో సూరేకారంలాటి స్వభావంగల అమ్మాయికి తనంటే ఆసక్తి ఏర్పడటానికి కారణం ఏమిటో చంద్రానికి తెలియలేదు. మొదట మొదట్లో అతను చాలా ముభావంగానే వుండేవాడు. కానీ క్రమేపీ అరుణ చూపించిన అనురాగంతో అతని సంకోచం పటాపంచలు అయింది. ఇద్దరూ చేరువయ్యారు. మనసులు విప్పి మాట్లాడుకున్నారు. ఆంతర్యాలు ఏకమైనాయి.

ఓ శుభముహూర్తాన అరుణ చంద్రాన్ని తీసుకెళ్ళి బాబాయికి పరిచయం చేసింది. అరుణ కాఫీ తీసుకురావటానికి లోపలికి వెళ్ళిన పదినిమిషాల్లో చంద్రం స్థితిగతులు తెలుసుకున్న గోపాలంగారు ముఖం గంటు పెట్టుకుని, మిగతా సమయాన్ని ముభావంగా గడిపేశారు.

ఆరోజురాత్రి అరుణ నిలువెల్లా ఆవరించుకున్న సంకోచాన్ని ఎలాగో వదిలించుకుని పినతండ్రిముందు మనసులోమాట బైట పెట్టింది. ఆయన యిదేదో ముందే గ్రహించిన మనిషిలా కించిత్‌కూడా చలనం లేకుండా తాపీగా అసలు విషయం వదిలేసి, ప్రపంచపు తీరుతెన్నులు ఏకరువుపెట్టారు. అరుణని అమాయకురాలివనీ, పసిపిల్లవనీ గుర్తుచేశారు. చివరికి చంద్రానికి నీమీద వున్న మోజుకి అసలు కారణం ఆస్థి అని తను కనిపెట్టేసి, ఆ రహస్యాన్ని అరుణకి తెలియచేస్తున్నట్టు మాట్లాడారు. ఒకవేళ తన అభిప్రాయం పొరపాటయి చంద్రం నిజంగా మంచివాడే అయినా అతనికి అరుణని భార్యగా పొందగలిగిన అర్హతా, హోదా లేదనీ – కాబట్టి తన కేమాత్రం ఇష్టం లేదనీ తేల్చి చెప్పేశారు. తలవంచుకుని, కాలి బొటనవేలు నేలమీద వ్రాస్తూ, కళ్ళనీళ్లు నిగ్రహించుకుంటూ నిలబడిన అరుణని ఆయన సరిగ్గా గమనించనేలేదు.


దాదాపు నెలరోజులు ఏం జరగలేదు. అరుణ యింట్లోంచి బైటకి వెళ్ళటంకూడా తగ్గించేసింది. గోపాలంగారు సంతోషించారు. సాధ్యమైనంత త్వరలో అరుణ పెళ్ళి చేయటానికి నిశ్చయించుకుని, సంబంధాలు చూడసాగారు. ఒక సంబంధం నచ్చింది. రేపు వుదయం ఫలానావాళ్ళు నిన్ను చూడటానికి వస్తారని చెప్పటానికి వెళ్ళినపుడు, అరుణ యింట్లో లేదు. అరుణ కోసం ఆదుర్దాగా, కాలు కాలిన పిల్లిలా తిరుగుతూ ఎదురుచూస్తుండగా, సాయంత్రానికి అరుణ చంద్రంతో కలిసి వచ్చి రిజిష్టర్ మ్యారేజ్ చేసుకున్నాం అని చెప్పింది. అరుణ తుపాకీ చూపించి 'నిన్ను కాలుస్తున్నాను బాబాయ్' అని చెప్పినా ఆయ నంత నిర్ఘాంతపోయేవారు కాదేమో! ఆశ్చర్యాన్నుంచి తేరుకున్న మరుక్షణం అగ్గిమీద

గుగ్గిలం అయ్యాడు. అయన కోపం అంతా చంద్రంమీద విరుచుకుపడింది. "అయితే నేననుకున్నట్టు అక్షరాలా నువ్వలాటివాడివే నన్నమాట. పెళ్ళికి నేను ఒప్పుకోనని తెలిసి దాన్ని మాయజుచ్చి బుట్టలో పెట్టావా? ఇది నీకు మంచిపనేనా! ఇలా అడ్డదోవలు తొక్కేందుకు నీకు సిగ్గెలా లేకపోయిందీ? అంత చాతనైనవాడివైతే, నిజంగా, మగ సిరికలవాడివైతే, నాకు నచ్చచెప్పి, నన్ను ఎలాగో ఒప్పించివుండేవాడివి. ఈ కాస్తలో ఎక్కడ చెయిజారిపోతుందో నని భయపడి దొంగచాటుగా మూడుముళ్ళూ వేశావా! ఇలాంటివాడివి ఎంతకైనా తెగించగలవు. ఏదైనా చేయగలవు. నిజం చెప్పు – నీకు పిల్లదానిమీద మక్కువా? దాని ఆస్థిమీదా?–"

అరుణ ఓ చెంప వారిస్తున్నా వినకుండా గబగబా పిడుగులవర్షం కురిపించేశాడు. అన్యాయంగా ఆరోపించబడుతున్న యీ మాటలన్నిటినీ రెండు చెవుల్తో వింటున్నా చంద్రం చలించకుండా రాయిలా నిలబడ్డాడు. అతని కళ్ళలో ఎర్రజీరలు తొంగి చూసినాయి. గుప్పెళ్ళుగా బిగుసుకున్న చేతుల్లో, బిగించిన దవడల్లో అతను ఎంత శక్తిని వుపయోగించి కోపాన్ని అపుకుంటున్నాడో, అవమానాన్ని దిగమింగుతున్నాడో అరుణ ఒక్క చూపులోనే గ్రహించింది. పైన వున్న జరీవుత్తరీయం తీసి విసురుగా దులుపుతూ గర్జిస్తున్నట్టు అన్నాడు గోపాలం. "ఫో ఫో, ఈ క్షణంనుంచీ నీ పెళ్ళానికి చిల్లిగవ్వ ఆస్థి లేదు. వుంటానికి పీడలేదు. కట్టుకోటానికి మరో చీరలేదు. ఏం చేసుకుంటావో చెయ్యి."

ఆయన మాట్లాడ్డం పూర్తయినతర్వాత చంద్రం అరుణవైపు తిరిగి నిశ్చలంగా అడిగాడు. "విన్నావుగా ఆ మాటలు. నేను మోసగాడినే అవుతానేమో! వంచకుడిని అయినా అవచ్చు. మరోసారి బాగా ఆలోచించుకో. నాతో వస్తావా? ఇక్కడుంటావా?" అన్నాడు.

అరుణ నిశ్శబ్దంగా అతని చెయ్యి పట్టుకుని బైటకి వచ్చేసింది.




అరుణ తలుచుకుంటే గోపాలం వుండే యింటితోసహా గోళ్ళూడకొట్టి లాక్కోగలిగేది. కానీ అంత అవమానం పొందిన తర్వాత, తండ్రికంటే మిన్నగా పెంచిన బాబాయ్ తనని అర్థం చేసుకోకపోయిం తర్వాత ఆ ఆస్థిలో చిల్లిగవ్వకూడా వద్దనుకుంది. పైపెచ్చు యీనాడు అంతగా అది అభివృద్ధి చెందటానికి చాలావరకు ఆయన స్వయంశ్రమేనన్న సంగతికూడా గుర్తు చేసుకుంది.

చంద్రం ఇంజనీరింగ్ రిజల్ట్స్ రాక ముందు రెండునెలలు, అతను ఫస్ట్‌క్లాస్‌లో పాసయినాడని తెలిసిన తర్వాతకూడా మరో ఎనిమిదినెలలు, దాదాపు సంవత్సరంపాటు యిద్దరూ నానా యాతనలూ పడ్డారు. అరుణ స్నేహితురాలింట్లో వెనకవైపుగా వున్న చిన్న గదిలో, తినీ తినక, గర్భదరిద్రం అంటే ఏమిటో, అది మనుష్యుల్లో కల సున్నితమైన భావాలను ఎలా మాడ్చి మసి చేస్తుందో అనుభవంలో గ్రహిస్తూ, ఐనాసరే ఆ గాలి తామిద్దరికీ సోకకుండా జాగ్రత్త పడుతూ, ముళ్ళకంపమధ్య నడకలా, ఎర్రటి ఎండలో ఎడారిలో పరుగులా రోజులు ఎలాగో వెళ్ళబుచ్చారు. చంద్రం నిరంతరాన్వేషణకి ఫలితంగా హైదరాబాద్ దగ్గిరున్న రామచంద్రాపురంలో వుద్యోగం వచ్చింది. క్వార్టర్స్ దొరికాయి. అనుకోకుండా జీవితం స్థిరపడిపోయింది. గడిచిన పదినెలలూ భయంకరమైన పీడకలలా మర్చిపోయే శాంతి లభించింది.

నూతన వాతావరణంలో, కొత్త వ్యక్తుల మధ్య కొత్త జీవితాన్ని సృష్టించుకున్నారు.

అరుణని ఆనాడు అలా కర్కశంగా బైటికి పంపేసినా, గోపాలంగారు వాళ్ళెలా వున్నదీ తెలిసినవాళ్ళద్వారా ఆరాతీస్తూనే వున్నాడనివిన్న అరుణ మండిపడిపోయింది.

వెంటనే పినతండ్రికి తల తిరిగేటంత ఘాటుగా వుత్తరం వ్రాసింది. అందులో చివర, "నీ ఆస్థి నాకేం అవసరంలేదు. అంతకి కోటిరెట్లు గల భాగ్యం నాకు లభించింది. అయినా బాబాయ్! ఇంత పెద్ద వయసులో నీకిదేం బుద్ధి? నాకు నచ్చిన వాడిని, అందులో చంద్రంలాంటి సమర్థుణ్ణి చేసుకుంటే నీ సంపద కేదో ముప్పు వస్తుందని భయపడ్డావు. అంతేనా! నీకు నచ్చిన ఏ వెర్రినాగమ్మనో నేను కట్టుకుంటే నీకు సంతోషంగా వుండేదనుకుంటా. ఆస్థిమీద నీకింత మమకారం వుందని ఆలోచనామాత్రంగానైనా నా చెవిని వేస్తే సంతోషంతో సర్వం నీకే యిచ్చివుండేదాన్ని. ఇప్పుడైనా నాకేం ఫర్వాలేదు. నా భర్త నాకన్నీ యివ్వగల సమర్థుడు. నా బీరువాలో యిప్పుడు నాక్కావాల్సినన్ని చీరె లున్నాయి. వుండటానికి పెద్ద యిల్లుంది. మా కేలోటూ లేదు. నీకూ, నీ డబ్బుకీ ఓ పెద్ద నమస్కారం. మా పేరు ఎత్తకు."

అట్లా వ్రాసిన వుత్తరాన్ని సగర్వంగా భర్తకి చూపించింది అరుణ.

"పోనిద్దూ, జరిగిందేదో జరిగిపోయింది; పెద్దవాడు. ఆయన మనసు మళ్ళీ బాధ పెట్టటం దేనికి? మన కిష్టంలేకపోతే మెదలకుండా వూరుకుంటే సరిపోలా?" మృదువుగానే మందలించాడు. అరుణ ఎంత హెచ్చరించినా వుత్తరం పోస్ట్‌లో వేయనే లేదు. ఎప్పుడో గుర్తుకు వచ్చినప్పుడు టేబిలులోంచి తీసి అరుణ ఎదుటే చించేశాడు. అరుణ గునిసినా అంతగా ఏం మాట్లాడలేదు.

రోజులు గడిచాయి. గోపాలంగారే ఓసారి స్వయంగా చంద్రంపేరిట వుత్తరం వ్రాశాడు. తను తొందరపడినమాట నిజమేనని ఒప్పుకుంటూ, ఇద్దర్నీ యింటికి రమ్మనమని ఆహ్వానిస్తూ, సాధ్యమైనంత త్వరలో సబ్బుకు సంబంధించిన బాధ్యత స్వీకరించి తనని బంధవిముక్తుడిని చేయమని మరీమరీ కోరుతూ వచ్చింది వుత్తరం.

చంద్రాన్ని ఎలాటి సమాధానం వ్రాయవద్దంది అరుణ. అతను తర్వాత ఆ వుత్తరం గురించిన ప్రసక్తి ఎత్తలేదు.

విదేశాల్లో చదువు ముగించుకుని వచ్చిన శంకరం స్వదేశానికి రాగానే సరాసరి అరుణ యింటి కొచ్చాడు.

'అక్కా!' అని నోటినిండా ఆప్యాయంగా పిలుస్తున్న అతని పిలుపుకి అరుణ మనసులోనికాఠిన్యం దానంతట అదే కరిగిపోయింది.

శంకరం నాలుగురోజు లున్నాడు.

అతను వున్నప్పుడే గోపాలంకూడా వచ్చాడు.

ఇంటికి వచ్చిన మనిషిని అమర్యాద చేయటం ఎలాగో అరుణకి తెలియలేదు.

చంద్రంకూడా బాగానే కలిసిపోయాడు.

అరుణకి ఆనందంలాంటిదే అన్పించింది.

విదేశాలకు వెళ్లొచ్చినా, చంద్రం, తండ్రి నిర్ణయంచేసిన పిల్లనే పెళ్ళి చేసుకోటానికి ఒప్పుకోవటంచూసి అరుణకి కాస్త ఆశ్చర్యం వేసింది. పెళ్ళిచూపులకి అరుణకూడా రావాలని పట్టుబట్టాడు శంకరం. చంద్రం యిష్టపడలేదు. అరుణ కాస్త అయిష్టంగానే మానేసింది.

ముహూర్తం నిర్ణయించారు. నెలరోజులు ముందే రావాలని గోపాలం మరీ మరీ కోరుతూ వుత్తరం వ్రాశాడు.

శంకరంఅయితే సరాసరి యింటికి వచ్చి "ఇదుగో, అక్కా! నువ్వుగనక రాకపోయావంటే పెళ్ళే ఆగిపోతుంది. ఆడపెళ్ళివారు వొచ్చి మీ యింటిముందు సత్యాగ్రహం చేసే ప్రమాదం వస్తుంది," అని శపథంచేసి మరీ వెళ్ళాడు.

చంద్రానికి ఆఫీసులో పనివత్తిడి ఎక్కువగా వుంది. ఒక్కరోజుకాదు, ఒక్కపూట కూడా శలవు దొరికేట్టు లేదు. పెళ్ళి సమయానికి,ముహూర్తంటైముకి వెళితే వెళుదువు గానిలే అంటాడు అతను. యింటి ఆడబడుచుని– ముందే వెళ్ళాలి అంటుంది అరుణ. ఫలితంగా యిద్దరిమధ్యా చిన్న అభిప్రాయ భేదం వొచ్చింది. అరుణ అంతగా వెళ్ళాలని పట్టుపట్టటానికి ఆంతర్యంలోగల అసలు రహస్యం మహారచయిత్రి 'జీవన బంధాలు'లో దాంపత్యజీవితాన్ని గురించి చేసిన వుపదేశం. యిప్పట్లో మళ్ళీ యిలాటి అవకాశం మళ్ళీ రాదు. దాన్ని పోనివ్వకూడదని అరుణ ఆరాటం.

మధ్యాహ్నం మూడింటికి వెళ్ళిన చంద్రం రాత్రి తొమ్మిదికి యింటికి చేరుకున్నాడు. వస్తూనే ముందుగదిలో కూర్చుని ఎదురు చూస్తున్న భార్యని గుర్తించనట్టే సరాసరి లోపలికి వెళ్ళిపోయాడు. బట్టలు మార్చుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళి స్నానంచేసివచ్చి పడుకున్నాడు.

"వడ్డించాను, రండి." గదిగుమ్మంలో నిలబడి పిలిచింది అరుణ.

"నాకు ఆకలి లేదు."

అరుణ గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది. అతని నిర్లక్ష్యం సూదులతో గుచ్చినట్లు ఎట్లా బాధిస్తూందో మొదటిసారిగా అనుభవమైంది. అతను భోజనం చేయందే తను తినదని అతనికి తెలుసు. ఆకలితో పడుకుంటే రాత్రంతా నిద్రపట్టదని కూడా అతనికి తెలుసు. తెలిసికూడా కావాలని అన్యాయంగా శిక్షించినప్పుడు యిక చేసేది ఏముంది. గిన్నెలు సర్దివచ్చి ముందుగదిలో కూర్చుంది. ఏమీ తోచలేదు. నిద్ర అసలే రావటంలేదు. కాగితం కలం తీసుకుని వ్రాయటం ప్రారంభించింది.

'చూడండి!

నేనేం చెప్పినా మీరు వినటంలేదు. పెళ్ళికి వెళ్ళాలని నేను అనుకుంటున్నాను కానీ నిశ్చయం చేసుకోలేదు. మీరు వద్దంటే మానేస్తాను. కానీ నాయిష్టానికి వ్యతిరేకంగా ఒకపని చేసానని, మీ అభిప్రాయానికి బానిసనయిన క్షణాలుకూడా కొన్ని వున్నాయి అనే గరళంలాటి జ్ఞాపకంమాత్రం నాకు జీవితాంతం మిగులుతుంది. మన దాంపత్యం ప్రపంచంలో చాలామందిలాటివాటికంటే పూర్తిగా వేరని నాకు తెలుసు. అందుకే సూటిగా చెబుతున్నాను – మనస్పర్థలంటే నాకు తగని భయం. అపార్థాలంటే అంతులేని అసహ్యం. పెళ్ళికి నేను వెళ్ళాలా లేదా లేక ఎప్పుడు వెళ్ళాలి ఇదంతా మీ నిర్ణయం మీదనే జరుగుతుంది. నన్ను మన్నించండి.'

చాలా సేపయింది. అతను పిలవలేదు. అరుణ లేచి వెళ్ళలేదు. పగలంతా బైట బాగా తిరిగిన చంద్రానికి చన్నీళ్ళస్నానం వలన కలిగిన హాయితో కళ్ళమీదకి మత్తులాటిది వచ్చేసి నిద్ర బాగానే పట్టేసింది. అర్ధరాత్రివేళ హఠాత్తుగా ఎందుకో మెలకువ వచ్చేసింది. చేస్తున్నపనేదో సగంలో ఆపేసి కలతనిద్ర పోయినటువంటి అనుభూతి కలిగింది. మంచంమీద లేచి కూర్చున్నాడు. టేబిల్‌లైటు వెలుగుతూనేవుంది. కానీ ప్రక్కన అరుణలేదు. చప్పున లేచి బైటకి వచ్చాడు. చీకటిగావున్న ముందుగదిలో పడగ్గదిలోంచి టేబిల్‌లైటు ప్రసరింపచేస్తున్న లేత వెలుగులో వెలుగునీడల మధ్యవున్న చిత్తరువులా, కుర్చీలో మెడ




వెనక్కి వాల్చి అరుణ నిద్రపోతోంది. పొడుగాటి జడ కుర్చీమీదనుంచి నల్లతాచులా వ్రేళ్ళాడుతోంది. పైకెత్తిన గడ్డంతో నిపుణుడైన శిల్పి మలిచిన విగ్రహంలా వుంది. అలా వున్న అరుణని చూడగానే అతని గుండెల్లో మృదుమధురమైన భావమేదో వువ్వెత్తుగా కెరటాల్లా లేచి విరిగి పడింది దగ్గరగా వచ్చి ఒకచెయ్యి మెడ క్రిందా, మరోచెయ్యి మోకాళ్ళక్రిందా వేసి లేవనెత్తి గదిలోకి తీసుకువచ్చాడు.

మంచం మీద పడుకోబెడుతుండగా, "నేను మేలుకునే వున్నాను," అన్నస్వరం నిద్రమత్తుగా, నీరసంగా విన్పించింది.

"అదే నేను అడుగుతున్నాను. ఇంత రాత్రివరకూ నిద్రపోకుండా ఏం చేస్తున్నావు?"

''ఎంతరాత్రి అయింది?''

టేబిల్‌దగ్గర కెళ్ళి గడియారం చూస్తూ 'ఒంటిగంటన్నర' అన్నాడు.

అరుణ నిట్టూర్పు విడిచింది. అంటే ఆ నరకంలో దాదాపు నాలుగ్గంటలు వున్నదన్న మాట. అబ్బ! నాలుగు యుగాలైనట్టు అన్పించింది.

చంద్రం లైటు తీసేసివచ్చి పడుకున్నాడు. అతను ఆశించినట్టు అరుణ దగ్గరకు జరగలేదు.

అరుణ వూహించినట్టు అతనిచేయి తన తలక్రింద దిండుగా మారలేదు.

శరీరాలు చేరువలో వున్నా మనసులు మైళ్ళదూరంలో వున్నాయి

చాలాసే పయినతర్వాత అతను పిలిచాడు. "అరుణా!"

''........''

''నిజంగా నిద్ర పోయావా?''

'నిద్ర పొమ్మన్నారుగా."

''ఇప్పుడు వద్దంటున్నాను, మానేయ్."

అరుణనుంచి యెలాటి సమాధానం రాలేదు.

"పెళ్ళికి నువ్వు వెళ్ళచ్చు.''

"థ్యాంక్స్."

''నాకేం అవసరంలేదు.''

కాస్త ఆగి అరుణచేతిని తన రెండు చేతుల్లోకి తీసుకుంటూ మృదువుగా చెప్పాడు: ''మధ్యాహ్నంనుంచీ ఆలోచించాను. నీ పట్టుదల నాకు తెలియంది కాదు. అయినా సరే, నిజంగా నేను వద్దు అంటే నువ్వు మానేస్తావు. ఆ సంగతి నాకు తెలుసు. కానీ తర్వాత జీవితాంతం బలవంతంగా నీచేత ఒకపని చేయించానేమోననే అశాంతి నాకూ, తప్పనిసరిగా ఒప్పుకున్నాను అనే బాధ నీకూ మిగిలే ప్రమాదం వుంది. అందువల్ల నాకిష్టంలేదు.''

అరుణ గుండెలు కొట్టుకున్నాయి. 'నిజంగా యితనిలో ఏ దివ్యదృష్టి ఆయినా లేదుకదా!'

అత నింకా చెబుతూనే వున్నాడు

"ఇప్పుడేకాదు, ఎప్పుడైనాసరే; నువ్వు మనస్ఫూర్తిగా కావాలీ అనుకున్నదాన్ని చేసెయి. నా యిష్టాయిష్టాలతో ప్రమేయం పెట్టుకోవద్దు. కానీ – చేసేముందు నాకు చెప్పటంమాత్రం మర్చిపోకూడదు. సరేనా!"

అరుణకి ఏదయినా చెప్పాలనిపించింది. కానీ ఏంచెప్పాలో తోచలేదు. ఐదునిముషాలు గడిచిం తర్వాత నిశబ్దంగావున్న వాతావరణంలోంచి మంద్రస్థాయిలో మృదుమధురంగా వీణని మీటుతున్నట్టు విన్పించింది అతనిస్వరం. ''అరుణా! యీ ప్రపంచంలో ఏదైనా చేయగలనేమోగానీ మనసుమాత్రం నొప్పించలేను. నిన్ను నిరాశ పరిచేకంటే యీ కంఠలో ప్రాణం లేకుండా పోవటం నాకు తేలికగా అన్పిస్తుంది.''

అరుణ నిగ్రహం సడిలింది. కోపం పటాపంచలైంది. చప్పున తలెత్తి అతని వక్షస్థలంమీద ఆనించుకుంది. కళ్ళు చెమర్చినాయి.

చాలాసేపు అతను అరుణ జుట్టునీ, చెంపలనీ నిమురుతూ వుండిపోయాడు. ఆకలీ, బాధా అన్నీ అస్పర్శతో కరిగిపోయినట్టే అన్పించింది అరుణకి. శాంతి పొందిన మనసు విశ్రాంతిగా భావించటంతో కళ్ళమీదకి అలసట మత్తుగా ఆవరించుకో సాగింది.

అరుణ చెంపలమీదకి వదులుగా జారిన

జుట్టుని చేత్తో తప్పించి సున్నితంగా చెవిపట్టి మెలిపెడుతూ, నిర్లక్ష్యం మిళితమైన కఠంతో గంభీరంగా నిదానంగా మళ్ళీ చెప్పాడు. "కానీ – చూడమ్మాయి. ఇప్పుడు నేను చెప్పినవన్నీ నా బలహీనతగా నువ్వు కల్లో కూడా భావించకూడదు. భావించావో, బాగా గుర్తుంచుకో. నువెప్పుడు దీన్ని నామీద అంకుశంగా తీసుకుని ప్రయోగించాలని చూస్తావో అప్పుడు నేను నీమీద కాస్తకూడా కనికరం చూపించను. వట్టి అడవిమనిషిలా మారి నిన్ను ఎన్ని విధాల వేధించాలో అన్ని విధాలా వేధిస్తాను. బాగా గుర్తుపెట్టుకో.''

'అదుగో – అదుగో – అనురాగాన్ని అహంకారం మింగేస్తోంది;' మనసులోనే అనుకున్న అరుణపైకి మౌనంగా, మాట్లాడకుండా వుండిపోయింది.

* * *

వంటరిగా రైలు దిగిన అరుణని చూసి గోపాలంగారు ఆత్రంగా, "అదేమిటి? ఒక్కదానివీ వచ్చావేం? అల్లుడెక్కడ?" అని అడిగాడు.

''శలవు దొరకలేదు బాబాయ్." అంది అరుణ.

''నిజమేనా? లేక..." అనుమానంగా చూశాడాయన.

"నిజంగానే.''

చాలా సంవత్సరాల తర్వాత మళ్ళీ ఆయింట్లో అడుగు పెడుతున్న మొదటి క్షణంలో అరుణకళ్ళు చెమ్మగిల్లినాయి. అరుణ వూహించినట్టే ఎక్కడి పనులు అక్కడ వున్నాయి. వెంటనే యింటిబాధ్యత నంతటినీ తన రెండుచేతుల్లోకి తీసుకుని పెళ్ళికి కావాల్సిన ఏర్పాట్లలో మునిగిపోయింది.

వూరు చేరగానే క్షేమంగా చేరానని తెలుపుతూ వ్రాయటం మినహాయించి మళ్ళీ భర్తకి మరోవుత్తరం వ్రాసేటందుకు తీరుబడి చిక్కలేదు. పెళ్ళి రెండురోజుల్లోకి వచ్చినా, చంద్రం రాకపోవటంచూసి శంకరం వైరిచ్చాడు. సమాధానంగా రావటానికి వీలు పడదని ముక్తసరిగా వుత్తరం వ్రాసి వూరుకున్నాడు. అరుణకి పెళ్ళయిన తర్వాత మొదటిసారిగా భర్తమీద కోపంలాటిది వచ్చింది.

శంకరం అత్తగారు సామాన్య కుటుంబీకులే అయినా వున్నంతలో, వాళ్ళస్థితికి తగినంతలో అతిధిమర్యాదల కెలాటి లోటూ రాకుండా మన్ననలు జరిపించారు. ప్రతి చిన్న సంఘటనా నిరాడంబరంగానే అయినా చూడ ముచ్చటగా, వేడుకగా, సరదాగా గడిచిపోయింది. కళకళ లాడుతున్న పెళ్ళి పందిరిమధ్య, హుషారుగా అటుయిటూ తిరుగుతూ సందడిగానే వున్నా, అరుణమనసు మధ్య మధ్య, చంద్రం సాన్నిహిత్యంగా లేనిలోటు గుర్తిస్తూనే వుంది. అతను వస్తే ఎంత బాగుండేది! జీవితంలో ఒక మధురమైన ఘట్టానికి తామిద్దరూ ఎలా దూరమైనారో తెలిసేది. ఈ సందడి, యీకలకలం రిజిష్టర్ మ్యారేజీలో ఎక్కడనుంచి వస్తుంది.

భోజనాలయినాయి. మగపిల్లవారి తాలుకు ఆడవాళ్ళంతా వాళ్ళకోసం ప్రత్యేకంగా కేటాయించబడిన గదిలో కూర్చుని తాంబూలం సేవిస్తున్నారు. దాదాపు పది పదిహేను రోజుల తర్వాత అరుణ తీరికగా కూర్చుని అమ్మయ్య అనుకుంది. భుజాలమీదనుంచి బరువు ఏదో దింపుకున్నట్టే అన్పిస్తోంది.

అరుణ కూర్చునివున్న గదికి ఎదురుగుండావున్న పెద్దహాల్లో దూరంగా ఓ పదిహేను, ఇరవై మందికి తక్కువ కాకుండా ఆడవాళ్ళ గుంపొకటి కన్పించింది. వాళ్ళంతా వలయాకారంగా గుమిగూడి దేనినో చూడటానికి ఆత్రుత ప్రకటిస్తున్నారు.

''ఏమిటది?'' వెండిపళ్ళెంతో తాంబూలం తెచ్చి తన కందిస్తున్న అమ్మాయిని కుతూహలంగా అడిగింది అరుణ.

రెండు జడలు వేసుకుని, సాధనా హెయిర్ కటింగ్‌తో వున్న ఆ అమ్మాయి ఒక్కసారి ఒయ్యారంగా భుజంమీదనుంచి మెడతిప్పి చూసి,

''అదా! సంయుక్త వచ్చారు. ఆవిడని చూడాలని, పరిచయం చేసుకోవాలని వాళ్ళ ఆర్భాటం అంతా,'' అంది నిర్లక్ష్యంగా.

''సంయుక్తా! ఎవరూ? కథలు వ్రాసే ఆవిడే," అరుణ నమ్మలేనంత ఆశ్చర్యంగా అడిగింది.

"ఆ! ఆవిడే! ఆంధ్రదేశంలో ఇంకెంతమంది సంయుక్త లున్నారు? మీక్కూడా కథలపిచ్చి వుందా?"

"ఏం మీకు లేదా?'' అరుణ విస్మయంగా అడిగింది.

రెండుజడలు వేగంగా వూగేంత గట్టిగా తలూపింది ఆ అమ్మాయి. "ఉహుం. నాకు తెలుగు నవలలన్నా, తెలుగు సినిమాలన్నా ఎలర్జీ.''

అరుణ చాలా సానుభూతిగా చూసింది. 'పాపం, మళ్ళీ తెలుగు అమ్మాయివే; తెలుగు మాట్లాడడం ఎలర్జీకాదా?' అనుకుంది మనసులో.

ఆ అమ్మాయి అంతటితో వదిలి వెళ్ళిపోలేదు. ఇంకొకసారి భుజంమీదనుంచి కళ్ళు తిప్పి హాల్లోకి చూసి కనుబొమలెత్తి పెదవి విరుస్తూ, ''అందులో ఈవిడన్నా, ఈవిడ కథలన్నా మరీ తలనొప్పి."అంది.

''ఎందుకనో తెలుసుకోవచ్చా?–''

''నిరభ్యంతరంగా. మొదటిది: ఆవిడ అసలు పేరు సరస. అది సంయుక్తగా మార్చుకుని పేరుచుట్టూ ఓ గ్లామర్ పరచుకుంది. రెండోది: ఆవిడతో మాట్లాడాలంటే భయం. సింపుల్‌గా చెప్పాలంటే మనం మాట్లాడుతాం, ఆవిడ ఉపన్యాసాలు యిస్తుంది. ఏ సంభాషణ ప్రారంభించబోయినా అది సమస్యక్రిందికి లాగి తర్కం లేవదీస్తుంది. అందుకే ఆవిడ వ్యాసాలు కాస్త బాగుంటాయి.''

"వ్యాసాలుకూడా వ్రాస్తుందా–వేటిమీద?" అరుణ కొత్తవిషయం తెలుసుకొంటున్నట్లుగా అడిగింది.

''ఒకదానిమీదేమిటి? కంటికేది కన్పిస్తే దానిమీద. ఆవిడ ఒక్క వ్యాసకర్తేనా! వక్త. మంచి విమర్శకురాలుకూడా!''



"నిజంగా! నాకు తెలియనేలేదుసుమా! నేమ వెళ్ళి పలకరిస్తే మాట్లాడుతుందా?"

ఈసారి ఆ అమ్మాయి అరుణని జాలిగా చూసింది. "ఆవిడేమన్నా దిగివచ్చిన దేవతటండీ! రండి మీరు. కావాలంటే నేను పరిచయం చేస్తాను. ఆవిడ నాకు దూరపు బంధువు. వరుసకి వదిన అవుతుంది," అంది సగర్వంగా.

అరుణ మారుమాట్లాడకుండా లేచి ఆ అమ్మాయితో చెయిపట్టుకుని హాల్లోకి నడిచింది. ఎంత చిత్రం! తనీ పెళ్ళికి రావాలని పట్టుబట్టటం ఓ విధంగా ఆవిడ రచనే! ఇక్కడ అనుకోకుండా కలవటం ఎంత అదృష్టం!

చుట్టూ గోడలా కట్టివున్న మహిళా బృందాన్ని తోసుకుని ఎలాగో లోపలికి అడుగు పెట్టారు.

అక్కడ క్రింద పరచివున్న తివాచీమీద గోడనానుకుని కూర్చుని వుంది సంయుక్త. దాదాపు అరుణ వయసే వుంటుంది. మనిషి సన్నగా, పొడుగ్గా చువ్వలా వుంది. ముక్కు, పెదవులు, కళ్ళు, ముఖం అన్నింటిలోనూ ఓ విధమైన సూదిమొనలాటి వాడితనం స్పష్టంగా కన్పిస్తోంది. కళ్ళలో ఆకర్షణ కంటే చురుకుదనం ఎక్కువగా వుంది. శరీరానికి అంత మంచి ఆ ఛాయే లేకపోతే ఆవిడ ఆకృతి మరోవిధంగా వుండేదేమో!

అవిడని చూసిన కాసేపటికి, మనకి అనుకోకుండా సన్నగా, పొడవుగా తీక్షణంగా, వాడిగా వుండి తళతళ మెరిసే చురకత్తి గుర్తుకువస్తుంది.

అరుణ చెయిపట్టి లోపలకు తీసుకువెళ్ళిన రెండుజడల అమ్మాయి సరాసరి వెళ్ళి వెనకనుంచి ఆవిడ భుజంమీద గట్టిగా చరిచి ''ఏమమ్మోయ్ వదినా! ఇదిగో నీ అభిమాన పరంపరతో మరో పరమాణువు నిన్ను చూడాలని తహతహలాడిపోతూంది. పేరు అరుణ అని విన్నాను. ప్రస్తుతపు హోదా పెళ్ళికొడుక్కి తోబుట్టువు.''

అంతగట్టిగా చరిచిన చరుపుకి, అదే అరుణ అయితే అంతెత్తున ఎగిరిపడి భుజం వుందో వూడిపోయిందో ముందు సరిచూసుకుని తర్వాత తలెత్తేది. కానీ సంయుక్త చిరునవ్వుతో తలతిప్పి అరుణవైపు దృష్టిని పరిచింది.

అరుణ నమస్కరించింది.

ఆవిడ ప్రతి నమస్కారం చేసి, ''పెళ్ళికొడుకు తోబుట్టువు వంటున్నారు. దు కూర్చోండి,'' అంది తివాచీమీద చోటు చూపిస్తూ మర్యాదగా. అరుణ వచ్చి కూర్చుంది.

''నువ్వంటే చాలా యిష్టంట,'' మరోసారి పెదవులు సాగదీస్తూ అని రెండుజడల అమ్మాయి వెళ్ళిపోయింది.

''నేనంటేనా? నా పుస్తకాలంటేనా?'' అరుణ ముఖాకృతిని పరిశీలిస్తూ చిరునవ్వుతో ప్రశ్నించింది.

''మొదట మీ పుస్తకాలు; ఇప్పుడు మీరు.''

'నా పుస్తకాలు ఎందువల్ల మీకు ఇష్టమో చెప్పగలరా?''

అందరూ మౌనం వహించి అరుణ వైపు ఆసక్తిగా చూస్తున్నారు.

ఓసారి చుట్టూ చూసిన అరుణ చెక్కుచెదురుకుండా ''బాగుంది, ఎందుకేమిటి? చాలా సహజంగా వుంటాయి కాబట్టి,'' అంది.

సంయుక్త ఒక్కసారి ఫక్కుమని నవ్వింది. అంతలోకే నవ్వు అణుచుకుని గంభీరంగా, ''ఓకే! మీ రెవరో దేవదూతల్లా వున్నారు,'' అని చుట్టు చూస్తూ, ''యిప్పుడే వాళ్ళంతా నా కథలు అంత అసహజంగా ఎందుకుంటాయని నన్ను నిలదీస్తున్నారు,'' అంది.

''అసహజంగానా?''

''ఔను. వాళ్ళేకాదు, చాలామంది అంతే. రోజుకి కనీసం నాలుగయిదు వుత్తరాలయినా వస్తూవుంటాయి. నేను సృష్టించిన మనుష్యుల్లాటి మనుష్యులు ఈ ప్రపంచంలోనే లేరట. ఇది వాళ్ళ ఫిర్యాదు. వున్నారంటాను నేను. చూపించ మంటారు వాళ్ళు. ఇంతలో మీరు వచ్చారు నిజం చెప్పండి. నిర్మొహమాటంగా మాట్లాడండి. నే నేమీ అనుకోను. నిజంగా నా కథలు మీకు సహజంగా కన్పించాయా? అలాటి వ్యక్తులు మీకు జీవితంలో తారసిల్లారా?''

అరుణ బుగ్గల్లో కొద్దిగా ఎరుపు కన్పించింది. క్షణంసేపు తటపటాయించి క్రిందికి చూస్తూ వూరుకుంది.

''చెప్పండి. జంకుతున్నా రెందుకు?''

అరుణ కళ్ళెత్తి చుట్టూ కలియజూసి సంయుక్తమీద చూపు నిలిపి అంది: ''జంకు కాదు. నేను మీ ఒక్కరికయితే చెప్పగలనేమో! ఇంతమందిలో చెప్పలేను ఎలా చెప్పాలో నాకు తెలియదు.''

అందరూ మొహమొహాలు చూసుకున్నారు

సంయుక్త చప్పున వంగి అరుణ చేయి పట్టుకుంటూ అంది, ''మీరు మా యింటికి తప్పకుండా రావాలి. వాళ్ళందరిముందూ చెప్పనవసరంలేదు.''

''అరుణా! శంకరం నిన్ను పిలుస్తున్నాడు,'' ఎవరో పిలవటంలో అరుణ లేచి నిలబడింది.

సంయుక్తకూడా లేచినిలబడింది. ఇద్దరూ దాదాపు ఒకే ఎత్తులో వున్నారు.

''మీరు వెళ్ళేలోపల మా యింటికి రావటం మర్చిపోవద్దు.''

''మర్చిపోను.'' అరుణ చూపుల్తోనే వాగ్దానం యిచ్చింది.

అరుణ వెళ్ళిపోతుంటే సంయుక్త సగర్వంగా అంది: ''చూశారా మరి నా కథల్లో పాత్రలు పూర్తిగా అబద్ధాలు అన్నారు.''

కాని ఎవరూ సంయుక్తవైపు చూడటం లేదు. పొడుగాటి వాలుజడ నల్లతాచులా వీపుమీద అటుయిటు ఊగుతోంటే, దూరంగా వెళ్ళిపోతున్న అరుణవంక విచిత్రంగా చూస్తున్నారు.

* * *

సాయంత్రం పెండ్లాట, రాత్రికి అప్పగింతలు, మర్నాడు ఉదయమే తిరుగు ప్రయాణం అవటంతో అరుణకి ఎంత ప్రయత్నించినా సంయుక్త యింటికి వెళ్ళటానికి అవకాశం చిక్కనేలేదు. తీరా బండిలో కాలు పెట్టబోయేముందు పెళ్ళికూతురుతమ్ముణ్ణి వెంటబెట్టుకుని వెళ్ళింది. వూరికి కాస్త దూరంగా, చెరువుకి దగ్గిరగా వుంది పెద్ద పెంకుటిల్లు. ఇంటిముందు పూలమొక్కలవీ వున్నాయి. గడపల్లోనే ఎదురైన సంయుక్తని అప్రయత్నంగా రెండుచేతులూ పట్టుకుంటూ, త్వరత్వరగా అంది: ''మీరు నన్ను క్షమించాలి. నిన్న ఒక్క క్షణంకూడా తీరుబడి దొరకలేదు.''

'ఇందులో క్షమించటానికి ఏముంది? ఆ మాత్రం అర్థం చేసుకోలేనా. నిన్న ఆ కాస్త వ్యవధిలోనే మీరు వరుడితరపున పెద్ద అని గ్రహించాను. రండి, ఒక్కక్షణం కూర్చోండి.'' లోపలికి దారితీస్తూ అంది.

అరుణ లోపలికి అడుగుపెట్టింది. ఇల్లు పాతకాలపుదయినా ఆ గదిని అలంకరించిన తీరు మాత్రం పూర్తిగా అధునాతన పద్ధతిలో వుంది. గదిలో ఖరీదుగల మెత్తటి సోఫా సెట్టు వుంది. ఓ ప్రక్కగా చిన్న టేబిల్, దానిమీద బాటరీతో పలికే రేడియోవున్నాయి. గదినిండా పుస్తకా లుంటాయని వూహించిన అరుణకి పూర్తిగా ఆశాభంగం కలిగింది.

మధ్యలో వున్న టీపాయిమీద రెండు మూడు ఇంగ్లీషు మాగ్ జైన్లుతప్ప ఇం కేం లేవు. గోడకి ఓ వైపు వివేకానందుడిది. రెండో వైపు అరవిందుడిది ఫొటోలున్నాయి.-అంతే.

కిటికీ దగ్గరగా నిలబడితే దూరంగా చెరువు. దానికి నీళ్ళకోసం వచ్చిపోయే ఆడవాళ్ళు కన్పిస్తారు. మరోవైపు కిటికీ దగ్గర నిలబడితే ఎత్తుగావున్న శిఖరంతో వేణుగోపాలస్వామి ఆలయం కన్పిస్తుంది. అందులోని గంటలు విన్పిస్తున్నాయి.

అరుణ చూపులని గమనిస్తూ అర్థం చేసుకున్నదానిలా చిరునవ్వుతో అంది సంయుక్త : "ప్రశాంతంగా నా రచనా వ్యాసంగం అద్భుతంగా సాగుతుంది కాబట్టే నే నీ పల్లెటూరిలో వుండగలుగుతున్నాను. లేకపోతే ఎప్పుడో పారిపోయేదాన్ని."

"అదేం?"


"అవును. నిజం చెప్పాలంటే యీ వూరంటే నాకు మాచెడ్డ అసహ్యం. ఇక్కడున్నంత కుళ్ళు. ఈ వూళ్ళో మనుష్యుల్లో వున్నంత నీచత్వం భారతదేశం మొత్తం గాలించినా కన్పించదని ఘంటాపథంగా చెప్పగలను."

"వాళ్ళని మీరు మార్చటానికి ప్రయత్నించలేదా?"

సంయుక్త తమాషాగా తలూపుతూ, "వచ్చినకొత్తలో అలాటి వెర్రి మొర్రి ప్రయత్నాలు కొన్ని చేశాను. కానీ కొద్ది రోజులు గడిచింతర్వాత. వాళ్ళని నేను మార్చటం వదిలి, వాళ్ళే నన్ను మార్చేస్తున్నారని గ్రహించాను. ప్రమాదం పసిగట్టిన వెంటనే లెంపలేసుకుని. దూరంగా వుండిపోయాను. మీరు కూర్చోనే లేదు, నిలబడే వున్నారు."

అరుణకి మళ్ళీ తన ప్రయాణం గుర్తుకు వచ్చింది. వులిక్కిపడుతూ ఖంగారుగా 'నే వస్తాను. నాకు మీతో మాట్లాడిన తృప్తి కలగలేదు.' అంది.

"నాక్కూడా. మీరు మళ్ళీరండి మా వూరు.




'కాదు, వీలుపడదు. యిప్పటికే మా వారికి నామీద చాలాకోపం వచ్చింది."

"మీవారిని గురించి చెబుతానన్నారు."

"చెప్పటానికి పెద్దగా ఏమీలేదనుకోండి" గుమ్మందాటబోతున్న అరుణ వెనక్కి తిరిగి నవ్వుతూ 'ఒక్కమాటలో చెప్పాలంటే- మా వారు అచ్చం మీ కథల్లో హీరోలా వుంటారు.' అంది.

"నిజంగా! అయితే మీనుంచి కొన్ని కబుర్లు నేను వినితీరాల్సిందే. మీవారి సంగతేమోగాని, మీరుమాత్రం నా కథల్లో నేను వ్రాసుకునే నాయికలా వున్నారు. చూడగానే అనుకున్నాను."

"మీరు అతిశయోక్తి మాట్లాడుతున్నారు." బైటకి వచ్చేస్తోంది అరుణ.

"వెడుతూ వెడుతూ అలాటి అపనింద మాత్రం వేయకండి. నేను నిజాన్ని నిర్మొహమాటంగా చెప్పేవాళ్ళలో ప్రథమురాలివి. సరే వుంటాను నేను. మీరు మళ్ళీ వస్తారని నమ్మకంగా అన్పిస్తోంది. ఎలా అంటే చెప్పలేను." చేతులు జోడించి శలవు తీసుకుంటూ అంది సంయుక్త. అరుణ నమస్కరించి వచ్చేసింది. మనసంతా అసంతృప్తితో నిండిపోయింది. ఆవిడతో గంటలు క్షణాల్లా గడిచిపోతాయిలా వుంది అన్పించింది.

సంయుక్త జోస్యం అక్షరాలా నిజమైంది. మళ్ళీ మనుగుడుపులకి వెళ్ళటానికి అరుణే రావాలని శంకరం మొండిపట్టు పట్టాడు. కాదనలేకపోయింది. కానీ అవతల చంద్రం. ఈ పదిహేను రోజుల్లో అతని నిద్దను చి ఒక్క వుత్తరంకూడా రాలేదు. అరుణకి కాస్త అభిమానమే వేసింది. నేనిక్కడ నా వాళ్ళతో హాయిగా వుంటానని అతని ఉద్దేశ్యం. మళ్ళీ వూరు బైలుదేరేముందు తనిచ్చినట్టే టెలిగ్రాం యిప్పించింది 'సారీ డియర్, క్వైట్ హెల్ప్‌లెస్, ఎక్స్క్యూజ్ మీ.' అరుణకి మళ్ళీ సంయుక్తని చూడవచ్చుననే వుత్సాహంలో, చంద్రానికి కోపం వస్తుందేమోనన్న భయం అనుకున్నంతగా వేధించలేదు. శంకరం వూరికి చేరుకోగానే చీటీవ్రాసి పంపింది అరుణ

'చూశారా!

మీ జోస్యం నిజమైంది. నేను మళ్ళీ వచ్చాను. మీరు అయస్కాంతంలా నన్నిటలాగేశారు. మధ్యాహ్నం వస్తాను. మీ రాతాగీతా వుంటే అప్పటికి ముగించెయ్యండి.

సంయుక్త సమాధానం పంపింది.

'థాంక్స్. మీతో నా కేదో అవినాభావ సంబంధం వున్నట్టే అన్పిస్తోంది. రాతలు కోతలు బంద్. సాధ్యమైనంత త్వరలో బైలుదేరండి.

మీ
సంయుక్త

రెండురోజులు యిట్టే గడిచిపోయినాయి. ఈ రెండురోజుల్లోనూ సంయుక్త అరుణ నుంచి చాలా విషయాలు తెలుసుకుంది. ఇద్దరికీ ప్రాణస్నేహం కుదిరినట్టే అన్పించింది.

మూడోరోజు ఆఖరిరోజు. మర్నాడు తెల్లవారకముందే వెళ్ళిపోతున్నారు.

వీడ్కోలు తీసుకోటానికి వచ్చింది అరుణ.

"నేను మళ్ళీ యీపరిసరాల్లో యిమిడి పోవాలంటే నాలుగైదురోజులు పడుతుంది." చిరునవ్వుతో అంది సంయుక్త.

అరుణ చుట్టూ చూస్తూ అంది: "కథలు కల్పించుకునేందుకు యీ యేకాంతం బాగానే వుంటుంది. కానీ మనిషిగా జీవించాలంటే కొంచెం కష్టమే అనుకుంటా."

"చాలాకష్టం."

ఈ రెండురోజుల్లో అరుణ సంయుక్త విషయాలుకూడా కొన్ని గ్రహించగలిగింది. సంయుక్త మేనమామ యింట్లో వుంటోంది తల్లీ చెల్లెలూ తమ్ముడూకూడా యిక్కడే వున్నారు. వాళ్ళందరికీ సంయుక్త సంపాదనే ఆధారం. వారి అవసరాలు తీర్చటంవరకే సంయుక్తకి వాళ్ళ సంబంధం. ఆపైన అంటీముట్టనట్టుగానే వుంటుంది.

"నేనొకటి అడగనా?" అంది అరుణ.

"అడగండి"

"మీ రేమీ అనుకోరుగా"

"నాకూ నా అభిమానులకీ మధ్య అలాటి బేధాలేవీ వుండకూడదనే నా నిర్ణయం."

క్షణంసేపు తటపటాయించి, చివరికి అడిగేసింది అరుణ: "మీరు పెళ్ళెందుకు చేసుకోలేదు?"

"అడగబోయేముందు మీ జంకు చూసి యిలాటిదే ఏదో అడుగుతా రనుకున్నాను. సరిగ్గా అలాగే అడిగారు." నవ్వుతూన్న సంయుక్తముఖం గంభీరంగా మారింది. కళ్ళలో విషాదమేఘాలు తారట్లాడినాయి.

"ఒకప్పుడు పెళ్ళికోసం నేను మహా ఆరాటపడినమాట నిజమే. కానీ అప్పుడు నేను కోరుకున్నట్టే పెళ్ళి అయితే నే నిలా రైటర్ని అయే అవకాశం వుండేది కాదేమో."

"అంటే –"

"ఒకానొక విషమస్థితిలో జీవితాన్ని గురించి మర్చిపోవటం కోసం కలల్లో బ్రతకటం ప్రారంభించాను. ఆ తీయటి కలలే నా కథ లయాయి.'

అరుణ కొత్తవిషయం వింటున్నదానిలా ముందుకు వంగి ఆసక్తిగా చూసింది.

సంయుక్త చెప్పటం ప్రారంభించింది: 'నేను కాలేజీలో చదివేరోజుల్లో, ఒకతనితో పరిచయం కలిగింది. తర్వాత కొన్ని కారణాలవల్ల అతను వేరే వూరు వెళ్ళిపోవాల్సి వచ్చింది. కానీ ప్రతిసారి శలవులకి నే నున్న వూరు తప్పకుండా వచ్చేవాడు. మా యిద్దరి మధ్యా స్నేహాభిలాషతో చాలా మామూలుగా మొదలైన వుత్తరాలు మధురమైన ప్రణయలేఖలుగా మారి, చివరికి అంతులేని ఆవేదనకి చిహ్నాలుగా అంతమైనాయి. అతను నన్ను కాదంటాడని నేను కల్లోకూడా అనుకోలేదు. ఆ భంగపాటునుండి కోలుకోటానికి చాలారోజులు పట్టింది. దాదాపు పిచ్చిదాన్నయ్యాను."

"మిమ్మల్ని! తిరస్కరించాడా?" నమ్మలేనట్టు చూసింది అరుణ.

"నన్నే. అప్పటికి నేను మామూలు సరసని మాత్రమే. అతను నన్ను వదిలి వెళ్ళిపోయినా అతని ప్రభావం నన్ను వదిలిపోలేదు. నాలో వున్న అమాయకురాలిని చతురురాలయిన రచయిత్రిగా తీర్చి దిద్దింది. ఒక్కోసారి ఆలోచిస్తే ఇది నాకు ఒక విధంగా వరమేనేమో అన్పిస్తుంది. కానీ వంటరితనం క్రూరంగా హింసిస్తున్నప్పుడు శాపమే ననుకుంటాను."

అరుణకి ఏం చెప్పాలో తోచలేదు.

ఇద్దరిమధ్యా నిశ్శబ్దం ఏర్పడింది. ఎవరికి వారే దీర్ఘాలోచనలో మునిగిపోయారు

వున్నట్టుండి అంది అరుణ: "సరే, జరిగిందేదో జరిగిపోయింది. పగిలిపోయిన కుండని చూసుకుంటూ దాహం అపుకోవటం ఏమంత వివేకం. విరాళ నిర్జీవం చేస్తున్నా. ఎలాగో శక్తి తెచ్చుకుని మరో పాత్రకోసం వెతకటం ధీరుల లక్షణంకదా!"

"కాదు అరుణా, కాదు. నావల్ల కానే కాదు." తల అడ్డంగా తిప్పుతూ అంది.

"కాదని మీ రంత ఖచ్చితంగా చెప్పటం నాకు నచ్చలేదు. మనిషి తలుచుకుంటే సాధ్యం కానిదంటూ ఏముంది?"

టీపాయి మీదున్న పేపర్ వెయిట్‌ని చేత్తో అటూయిటూ తిప్పుతున్న సంయుక్త జవాబు చెప్పలేదు.

అరుణ బాధగా అంది: "మా అందరికీ యింత ఆనందం పంచియిస్తున్న మీరు ఏకాంతంగా యింత వంటరితనం భరిస్తూ వుండడం నా కేం బాగాలేదు."

క్షణంసేపు రెప్పవాల్చకుండా అరుణ వైపు చూసిన సంయుక్త, చటుక్కున లేచి టేబిల్‌దగ్గర కెళ్ళింది. సర్రున డ్రాయర్ సొరుగు లాగి దాన్లోంచి ఎర్రటి శాటిన్ రిబ్బను ముడివేసివున్న వుత్తరాలకట్ట తెచ్చి అరుణకి అందిస్తూ – "మీ సవాలు నా కర్థం అయింది. కానీ ఈ కట్టలో మీ చేతికి వచ్చిన రెండుమూడు వుత్తరాలు చదివి చూడండి. మీకే తెలుస్తుంది," అంది.

అరుణ వుత్తరాలవైపూ, సంయుక్తవైపూ మార్చిమార్చి చూసింది తర్వాత సంయుక్త చేతిని దూరంగా పెడుతూ, మృదువుగా, "అవి నేను చదవనవసరంలేదు. వాటిని భద్రపరచిన ఆ తీరు చూస్తేచాలు. అవి మీ కెంత ప్రియమైనవో తెలిసిపోతున్నాయి. నేననేదేమిటంటే–"

సంయుక్త అరుణని వాక్యం పూర్తిచేయనీయలేదు యెదురుగుండా కూర్చుని తనే వుత్తరాలు విప్పి ఒకటిరెండు తీసి చదివి విన్పించింది.

అరుణ కుర్చీలో వెనక్కు అనుకుని కూర్చుని శ్రద్ధగా వింది.

వుత్తరాలు నిజంగా చాలా బావున్నాయి. వాటిల్లో ఆ అనురాగానికి, ఆరాధనకి అరుణ



చిమిలిపోయింది. నిజంగా వాటినిండా ఎంత ప్రేమ! ఎంత ఆవేదన!

ఉత్తరాలు పొందిగ్గా మడుస్తూ అంది సంయుక్త: ''ఇప్పుడు చెప్పండి. ఇలాంటి అమృతం రుచిచూసిన నోటికి అంబలి ఎక్కుతుందంటారా?''

''నిజమే. ఏమైపోయాడతను ఎందుకు మీరు పెళ్ళి చేసుకోలేదు?" ఆదుర్దాని అణుచుకోలేక అడిగేసింది.

"ఏముంది! పాతకథే. యుగయుగాల నుంచి జరుగుతున్నదే! ఆస్థి, అంతస్థు గల అందమైన అమ్మాయి దొరికింది. వెళ్ళిపోయాడు." సంయుక్త కళ్ళలో ఎంత అణుచుకున్నా ఆగక నీరు తిరగటం అరుణ గుర్తించింది.

''ఒకటే నాకు బాధ. అది జీవితాంతం శూలంలా పొడుస్తూనే వుంటుంది. అతనంత మామూలువ్యక్తి అని గుర్తించలేకపోయాను. దానికి శిక్ష యింతక్రూరంగా అనుభవిస్తానని అనుకోలేదు.''

అరుణ ఆశ్చర్యంగా అడిగింది. "తర్వాత ఆతన్ని గురించి మీరేమీ వాకబు చేయలేదా? వెళ్ళిపోతే పోయాడులే అని ఊరుకున్నారా."

"ఊరుకోక చేసేదిమాత్రం ఏముంది.''

"ఏమో, నా కలా అన్పించటంలేదు. మీ పరిస్థితుల్లో నేనే వుంటే ఎలాగైనా సరే అతని వునికిని సంపాయించి పీక పిసిగి వుండేదాన్ని. అదీ సాధ్యం కాకపోతే అతన్ని గురించి వెంటనే అభిప్రాయం మార్చుకునైనా వుండేదాన్ని.''

"మీలాగా యిలా ఎటూకాకుండా జీవితం అంతా అన్యాయంగా, వేదనామయంగా మాత్రం చచ్చినా చేసుకునేదాన్ని కాదు.''

"ప్రపంచంలో అందరూ నీలా వుంటారనుకోవటం తెలివితక్కువ అరుణా!"గంభీరంగా వచ్చింది జవాబు.

అరుణ సర్దుకుని కూర్చుంది.

''అతని ఫోటోవుంది, చూస్తావా?"

''వుంటే యివ్వండి. తప్పక చూడా

ల్సిందే. ఆంధ్రపాఠకలోకం తరఫున కృతజ్ఞతలుకూడా అర్పిస్తాను.'' చిరునవ్వుతో అంది అరుణ.

సంయుక్త ఉత్తరాలమధ్య వున్న గులాబీ రంగు కవరులోంచి ఫొటో తీస్తోంది. అరుణ అది చూసి వ్యంగ్యధోరణిలో హాస్యంగా అంది: "భలే! చంపి సమాధి చేయాల్సిన మనిషిని గుండెల్లో గుడికట్టి భద్రంగా దాచి పూజిస్తున్నారా! నిజంగా మీరు చాలా వింత వ్యక్తులు సుమా!"

''నువ్వు నిర్మొహమాటివేకాదు; చాలా ప్రాక్టికల్ మనిషివికూడా.'' అ టూ ఫోటో అందిచ్చింది.

ఇంతలో లోపలనుంచి "అమ్మాయి సరసా! ఒకసారి లోపలికి రా. ఇప్పుడే వెడుదువుగాని. త్వరగా,' అంటూ తల్లి పిలవటంతో సంయుక్త-

'ఇప్పుడే వస్తా.' అంటూ లోపలికి పరుగెత్తింది.

"ఏమిటో అనుకున్నాను. ఈవిడ రచనలెంత సున్నితంగా వుంటాయో, అంతకు మించినంత వట్టి బేలమనిషిలా వుంది." సంయుక్త వెళ్ళినవైపే చూస్తూ అనుకుంది.

అరుణదృష్టి గుమ్మంవైపునుంచి అరచేత్తో పట్టుకున్న ఫొటోవైపు తిరగగానే త్రుళ్ళిపడింది. కుర్చీవెనక బాంబ్ పడినట్టుగా కెవ్వుమనబోయి ఎలాగో నిగ్రహించింది. ఎదురుగుండా కన్పిస్తున్న ఫోటోలోంచి ఫుల్ హాండ్ షర్టులో, మెడలో టైతో చంద్రం చిరునవ్వునవ్వుతున్నాడు. క్షణం సేపు అరుణ కళ్ళు బైర్లు కమ్మినట్టయింది. కలో నిజమో అర్థంగాలేదు. తను కూర్చున్న యీ పరిసరాలు, అసలు శంకరం పెళ్ళికి రావటం, ఈ సంయుక్త పరిచయం - అంతా సుడిగాలిలా మారి అరుణని ఒక్కసారి గిరగిరా తిప్పి ఆకాశంలోకి ఎత్తి, మరునిముషంలో భూమ్మీదకి నడుము విరిగేలా విసిరేసింది.

లోపలికి వెళ్ళిన సంయుక్త దాదాపు పావుగంట తర్వాతగానీ తిరిగిరాలేదు. వస్తూ రెండుచేతులతో రెండుచీరెలు పట్టుకొస్తూ "ఇందులో నీకే రంగు నచ్చింది?" అని అడిగింది.

అప్పటికే కిటికీ దగ్గరగా వెళ్ళి నిలబడిన అరుణ తిరిగిచూస్తూ "ఇదేమిటి? ఎందుకు?" అంది.

''నా సంతోషంకోసం మనిద్దరి పరిచయానికి చిహ్నం. ఈ వూరు యీ నేతచీరలకి ప్రసిద్ధి. నీకు చాలా బాగుంటుంది."

సంయుక్త బలవంతానికి అరుణ లొంగిపోక తప్పలేదు లేత నీలంరంగు చీర సంయుక్తకు నచ్చింది. అలాటిదే లేతగులాబీ రంగుది తాను కొని అక్కడికక్కడే బహుమతి యిచ్చింది.

''బదులు తీర్చుకుంటువా?'' సంయుక్త చిరుకోపంగా అంది.

''ఉహు. ఋణపడేలా చేసుకుంటున్నాను.'' గంభీరంగా వచ్చింది జవాబు.

''వుత్తరాలు వ్రాయటం మర్చిపోవుగా."

"ఉహుం. నేను వ్రాసిన వుత్తరాలతో అందమైన నవల తయారుచేసి యిస్తాను. మీ వాగ్దానంకూడా మీరు మర్చిపోకూడదు."

''మర్చిపోను.' సంయుక్త హామీ యిచ్చింది.

* * *

తెలతెలవారుతోంది. చంద్రం అప్పటికే లేచి అద్దంముందు కూర్చుని షేవ్ చేసుకునే ప్రయత్నంలో వున్నాడు. గడ్డానికి సోప్ పట్టించుకుంటుండగా వీధి తలుపులు టకటక లాడిన శబ్దం విన్పించింది.

''అమ్మగారింకా రాలేదు, వెళ్లు," కోపంగా కేకపెట్టాడు. రోజూ పొద్దున్నే పనిమనిషి వచ్చి తలుపు తట్టి 'అమ్మగారు వచ్చారా బాబూ' అని అడగటం, 'ఇంకా రాలేదని' చెప్పటం ఇదో పాటైపోయింది.

మళ్ళీ తలుపు తట్టినశబ్దం వినవచ్చింది.

''ఎవరు?''

సమాధానం రాలేదు.

"ఎవరది?" వేగంగా వచ్చి విసురుగా తలుపు తెరిచాడు. రెండో తలుపు తెరువబోతున్న చెయి ఆగిపోయింది. మాటాడటం మర్చిపోయిన మనిషిలా అలాగే నిలబడిచూశాడు. ఎదురుగుండా అరుణ నిలబడివుంది. దూరాన అరుణని దింపేసిన టాక్సీ వెనక్కి తిరిగి రోడ్డువయిపు మళ్లుతోంది. చంద్రం పెదవులు వ్యంగ్యంగా ఏవో అనబోయి ఎలాగో నిగ్రహించుకున్నాయి. ఒకేఒక క్షణం యిద్దరూ ఒకరిని ఒకరు కళ్ళతో కొలుచుకున్నారు.

"లోపలికి దయచేయండి.' దారి తొలగి నిలబడి అతి నమ్రతగా ఆహ్వానించాడు.

అరుణ లోపలికి వచ్చింది. చంద్రం వీధితలుపు మూసేశాడు

చేతిలో సూటుకేసు క్రిందపెట్టి ఒకసారి అరచేయి చూసుకుని పడగ్గదిలోకి వెళ్ళిపోబోతోంది అరుణ. ఇంతలో చంద్రం చేయి వెనకనుంచి వంచి జబ్బమీద గట్టిగా పట్టుకుంది. తనవైపు తిప్పుకుంటున్నాడు చంద్రం. ''ఇప్పటికి గుర్తు వొచ్చిందా ఇల్లు! అప్పుడే ఎందుకు వచ్చావు? ఇంకో రెండునెలలు వుండిరాకపోయినావా?"

అరుణ అతనివైపు అపరిచితుణ్ణి చూసినట్టు చూస్తోంది. ప్రయాణపు బడలికతో అలసట నిండిన ఆ కళ్ళలో ఆనందం లేదు. ఆదుర్దా అసలేలేదు. ఎప్పుడూ చూడని నైరాశ్యం నూతనంగా కన్పిస్తోంది.

''ఆదేమిటి-అలా వున్నావేం? ఏమైంది? నీకు ఒంట్లో బాగాలేదా?'' ఖంగారుగా అడిగాడు.

"బాగానే వుంది.'' ఎలాగో సమాధానం చెప్పగలిగింది.

''మరి అట్లా వున్నావెందుకు?''

అతని స్పర్శకి లొంగిపోకుండా, అతని మాటల్లో అనురాగానికి కరిగిపోకుండా వుండటానికి విశ్వప్రయత్నం చేస్తూ సమాధానం యిచ్చింది.

"నాకు మీ రెవరోలా కన్పిస్తున్నారు. నేనెరిగిన మనిషికాదు మీరు.''

''ఏమిటీ?'' చంద్రం అరుణ ముఖాన్ని రెండుచేతుల్లోకి తీసుకుని కళ్ళలోకి వెతుకుతూ 'మళ్ళీ చెప్పు' అన్నట్టు చూశాడు.

అరుణ మళ్ళీ చెప్పలేదు. చెప్పకపోయినా ఏదో వుందని అతని అంతర్యం పసిగట్టేసింది. ఇన్నాళ్ళనుంచీ తను కనీసం ఉత్తరం కూడా వ్రాయకుండా నిర్లక్ష్యం పరచినాడని అభిమానమూ అది!

చంద్రం అరుణని దగ్గరగా తీసుకున్నాడు.

ఐదు నిముషాలు గడిచింతర్వాత భార్యని మోచేతిదూరంలో నిలబెట్టి పరీక్షగా తనివిదీరా చూడబోయిన చంద్రం, వున్నట్టుండి ఒక్కసారి ఫక్కుమని నవ్వేశాడు. మరుక్షణం యిల్లంతా 'ఓహోహో' అన్న అతని నవ్వుతో ప్రతిధ్వనించిపోయింది

"ఏమిటది?" ఎక్కడో వున్నట్టున్న అరుణ తెప్పరిల్లుతూ అడిగింది.

చంద్రం అరుణ చెయ్యిపట్టి లాక్కెళ్ళి, భుజాలుపట్టి అద్దంముందు నిలబెడుతూ, "ఒకసారి అద్దంలో చూసుకో. ఇల్లాలికి ఇలాటి ఆతిథ్యం యింతవరకూ ఏ భర్తా యిచ్చివుండడు." అన్నాడు.

అరుణ అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంది. ముఖంనిండా, చెంపలమీదా, నుదుటమీదా, మెడదగ్గిరా చంద్రం గడ్డానికి వున్న షేవింగ్ సోప్ తెల్లటి నురుగుగా ముద్రలు పడింది.

"ఛి, ఛీ." వెంటనే కొంగు తీసుకుని తుడిచేసుకుంది.

చంద్రం ఆరోజు ఆఫీసుకి శలవుపెట్టాడు.

"ఏమిటి విశేషాలు? విషయాలేం చెప్పవేం?_" ఇల్లు సర్దుతున్న అరుణ వెన్నంటి తిరుగుతూ పదిసార్లు అడిగాడు.

"ఏం లేవు." ముక్తసరిగా అంది అరుణ.

"పెళ్ళి బాగా జరిగిందా?"


"ఆ!"

"నేను రానిలోటు నీకేం అన్పించలేదా?"

"బాబాయ్, శంకరం చాలాసార్లు అనుకున్నారు."

"నేను అడుగుతున్నది నీ సంగతి."

"నాకా! నాకంత తీరుబడి ఎక్కడిది? వెళ్ళినప్పటినుంచీ ఒకటే పని. ఊపిరి పీల్చుకునేందుకుకూడా టైమ్ లేకపోయింది. అందులో చాలా రోజుల తర్వాత వెళ్ళానేమో! చూడటానికి వచ్చినవాళ్ళతో పలకరింపులతోనే సరిపోయింది."




"సర్లే. నాకు తెలుసులే." ఆ పైన వినదగింది యింకేం లేనట్టు చిరాగ్గా వంటయింట్లోంచి బైట కెళ్ళిపోయాడు.

వెనకనుంచి రెప్పవాల్చకుండా అతనివైపు చూస్తున్న అరుణకి అతని మూర్తి, నడక, పరివర్తన, నవ్వు అన్నీ నూతనంగా, కృత్రిమంగా కన్పించసాగినాయి.

అరుణ ఆ రాత్రే సంయుక్తకి వుత్తరం వ్రాసింది. అందులో తను గుమ్మంలో అడుగు పెట్టగానే భర్త ప్రవర్తించిన తీరుని తియటి భాషలో చిలవలు, పలవలుగా వర్ణించి వ్రాయటం మర్చిపోలేదు.

చూస్తూండగానే మూడు నెలలు యిట్టే తిరిగిపోయినాయి. ఊరినుంచి తిరిగివచ్చిన అరుణలో ఓ విధమైన ఉదాసీనతనీ, నిర్లక్ష్యాన్నీ అడుగడుగునా గుర్తిస్తున్న చంద్రం దానికి కారణ మేమిటో తెలుసుకోవాలని ఎన్నివిధాలో ప్రయత్నించి అర్థంగాక విసిగి వూరుకున్నాడు.

చివరికి ఆఫీసుకి శలవుపెట్టి కొద్దిరోజులు ఎక్కడయినా సరదాగా గడిపివద్దాం రమ్మని భార్యని బయలుదేరమన్నాడు. అరుణ రానంది. కారణం చెప్పలేదు. మొండిగా రానని ఒకటే జవాబు. చంద్రం కోపంతో ఘర్షణపడి చివరికి కసిగా ఒక్కడే బయలుదేరి వెళ్ళిపోయాడు. పదిహేను రోజులు తిరిగి రావటానికి వెళ్ళినచంద్రం ప్రయాణం మధ్యలోనే రద్దుచేసుకుని, వారం తిరక్కుండానే యింటికి తిరిగి వచ్చేశాడు. అతని రాకకి అరుణ సంతోషం ప్రకటించలేదు. పట్టీపట్టనట్టుగా వుండిపోయింది. అతనికి నిరాశతో, కోపంతో పిచ్చెక్కుతుందేమో నన్నంత ఆవేశం వచ్చింది. ఐనా నిగ్రహం తెచ్చుకుని నిదానంగానే, అరుణ ప్రవర్తనకి సంజాయిషీ చెప్పమని నిలదీశాడు.

"నేను మామూలుగానే వున్నాను." ఒకటే జవాబు.

"మామూలుగా లేవు. లేవూ లేవు. నిజం చెప్పు. ఏమిటి? ఏమైం దసలు?"

చాలా రోజులనుంచీ మూగగా భరిస్తున్న చంద్రం, హఠాత్తుగా శాంతం కోల్పోయి గట్టిగానే అడిగాడు.

అరుణ మాట్లాడలేదు. చలనంలేని బొమ్మలా అతనిముందు నిలబడిపోయింది.

కొద్దిసేపు భార్యని తదేకంగా చూసిన అతను, చివరికి చెయిపట్టుకుంటూ దీనంగా అడిగాడు: "నన్నిలా నీ మౌనంలో చిత్రహింస చేయకు. ఎక్కడో ఏదో నానుంచి పొరపాటు జరిగింది. అదేమిటో నన్ను తెలుసుకోనీ. నా తప్పు తెలుసుకునేందుకు, సరిదిద్దుకునేందుక్కూడా నేను సిద్ధంగా వున్నాను."

"మీ రేదీ చేయనవసరంలేదు."

''అంటే? అంత క్షమించరాని నేరం జరిగిందా నావల్ల?"

"కాదు, కాదు." ఏంచెప్పాలో ఎలా చెప్పాలో తెలియని అరుణ హఠాత్తుగా రెండు చేతులూ జోడించి, ''మీకు పుణ్యం వుంటుంది, నన్నిలా ప్రశ్నలతో వేధించకండి. నాకు పిచ్చెక్కేట్టుగా వుంది. నిజంగా చెబుతున్నాను. భరించలేనంత విసుగ్గా వుంది,''అంది.

"విసుగా? దేనిమీద?" చంద్రం కొత్త విషయం విన్నట్టుగా అడిగాడు.

అరుణ మళ్ళీ మౌనం వహించింది.

"చెప్పు. విసుగు ఎందుకు? ఎక్కడ? ఎవరిమీద?"

ఎంత సేపటికీ భార్య నోటినుంచి ఎలాటి సమాధానం రాకపోవటం చూసి, చివరికి తన గుండెలమీద చూపుడు వేలు ఆనించుకుంటూ, అడగలేక అడిగాడు. ''నామీదనా?"

అరుణ యీసారి చెయి విదిలించుకుని, గిర్రున వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది.

చంద్రం చాలా సేపు అక్కడే స్థాణువులా నిలబడిపోయాడు. అతనిముఖం కత్తివేటుకి కూడా నెత్తురుచుక్క రానంత తెల్లగా పాలిపోయింది.

అరుణమధ్యా, సంయుక్తమధ్యా వుత్తర ప్రత్యుత్తరాలు అవిరామంగా సాగుతున్నాయి. సంయుక్తతో తన స్నేహం గురించి చంద్రానికి యిప్పుడప్పుడే చెప్పదల్చుకోలేదు అరుణ. ఒక పరిస్థితికోసం ఓపికగా ఎదురుచూస్తోంది. సంయుక్త కొత్త నవల వ్రాస్తోంది. ఆ నవలని ముందు చంద్రం చేత చదివించి తర్వాత సంయుక్తకి చూపించాలి. చూపించి ఆ తర్వాత? ఏమో ఏమౌతుందో అరుణకి తెలియదు. తెలుసుకోవాలనే కుతూహలంకూడా లేదు. చంద్రం, సంయుక్త జీవితాన్నే కాదు, అరుణ జీవితాన్ని కూడా శిధిలం చేశాడు. సంయుక్తలో కళ అనేది వుందికాబట్టి దాని నీడలో సేద తీరింది. కానీ తను! తనెలా కోలుకోవాలి? ఎంత ఆలోచించినా మార్గం దొరకటంలేదు.

ఆరోజు మధ్యాహ్నం సంయుక్త దగ్గర నుంచి వచ్చిన వుత్తరం చదువుకుంటోంది అరుణ. అందులో యిలా వుంది.

అరుణా!

ఈరోజుతో నా కొత్తనవల పూర్తి అయింది. ఎంత బాగా వచ్చింది అనుకున్నావు. నాకు చాలా తృప్తిగా వుంది. ఈ నవలతో రచనాస్థాయిలో నేను మరో మెట్టు ఎక్కాననే అనుకుంటున్నాను. సోమవారంనాడు పబ్లిషర్స్ వస్తున్నారు. నావుద్దేశ్యంలో నేనింతవరకూ వ్రాసినవాటిలో యిది వుత్తమమైన నవల—ముగింపుకూడా మంచి ట్విస్ట్‌తో చాలా అందంగా వచ్చింది. ఇప్పుడు మళ్ళీ తిరిగి చదువుతుంటే యిది వ్రాసింది నేనేనా అన్న ఆశ్చర్యం, ఆనందం కలుగుతున్నాయి. దీనికంతటికీ కారణం నువ్వు. దీనిలో మూడొంతులవరకూ మీ విషయాలున్నాయి. అందుకే ఇది నీకు అంకితం—''

అరుణ చదువుతూండగానే బాత్‌రూమ్‌లోంచి ధన్ మని ఏదో క్రిందపడిన చప్పుడు—ఆ వెంటనే 'చచ్చాన్రో' అన్న పనిమనిషి గావుకేక విన్పించినాయి.

వులిక్కిపడి ఖంగారుగా వుత్తరం టేబిల్ మీద పారేసి బాత్‌రూమ్‌లోపలికి పరుగెత్తింది.

లోపల కాలుజారి బోర్లాపడిన పనిమనిషి బాణందెబ్బతిని నేలగూలిన పక్షిలా విలవిలలాడుతూ 'ఓలమ్మో! నాకన్ను పోయిందిరో దేవుడో' అంటు బిగ్గరగా శోకాలు తీస్తోంది.

''అదేమిటి నూకమ్మా! అలా ఎలా పడ్డావ్. ఏదీ దెబ్బ ఎక్కడ తగిలిందీ? నన్ను చూడనీ!" అరుణ ఆదుర్దాగా లోపలికి వచ్చి పనిమనిషిని లేవదీసింది.

"సచ్చినాను నాతల్లో! కన్ను పోతే నాకు దిక్కెవడో! ఓరినాయినో!"

"అరరే. ఏమిటా కేకలు చిన్నపిల్లలా—ఏదీ—యిలారా—కన్ను చూడనీ."

బాత్ రూమ్‌లోంచి బలవంతంగా యివతలకి తీసుకువచ్చింది.

కాలుజారి బోర్లాపడడంతో వెళ్ళి బకెట్ మీద పడింది. బకెట్ కొక్కెం వుండే మొన కంటిప్రక్కగా రాచుకుపోయిందో. లేక కన్నుకి కూడా తగిలిందో! చిట్లి రక్తం వస్తున్నచోట యింత పౌడర్ తెచ్చి అద్ది అప్పటికప్పుడు తలుపులు మూసి తాళంవేసి దగ్గర్లోవున్న డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళి చూపించింది.

డాక్టర్ కన్నుకేం దెబ్బ తగల్లేదని హామీ ఇచ్చినతర్వాత నూకమ్మ శాంతిచింది. కట్టు కట్టడం పూర్తయిన తర్వాత నూకమ్మని వెంటబెట్టుకుని తీసుకెళ్ళి వాళ్ళమ్మావాళ్ళకి అప్పగించి యింటికి వచ్చేసరికి చీకటి పడింది. అప్పటికే యింటికివచ్చిన చంద్రం ముందుమెట్టుమీద నిలబడి అరుణకోసం ఎదురుచూస్తున్నాడు.

అరుణ వచ్చేటప్పటికే ప్రక్కింటాయన తల్లి జరిగిందంతా చేతులు తిప్పుతూ, అతనికి వర్ణించి చెబుతోంది.

"దెబ్బ అట్లా ఎట్లా తగిలిందీ. ఎలా వుందిప్పుడు?" అరుణని ఆదుర్దాగా అడిగాడు చంద్రం.

ఇంటితలుపు తాళం తీసి లోపలికి వస్తూ క్లుప్తంగా జరిగిందంతా చెప్పింది.

అరుణ వంటయింట్లోకి వెళ్ళి కాఫీ కలిపి తీసుకువచ్చేసరికి చంద్రం టేబిల్ దగ్గర కుర్చీలో కూర్చుని సంయుక్త రాసిన వుత్తరం చదువుతున్నాడు. అతని కనుబొమలు ముడుచుకున్నాయి. అరుణ చేతిలో కాఫీకప్పు క్షణంసేపు తొణికిసలాడింది. అంతలోనే నిగ్రహించుకుని ఏమీ ఎరుగని దానిలా కాఫీ తెచ్చి యిచ్చింది.

"ఎవరీ సంయుక్త?" తలెత్తుతూ అడిగాడు.

"రైటర్."

''నీ కెలా పరిచయం?

''శంకరం పెళ్ళిలో కలిసింది."

"ఇందులో మీవిషయాలంటుందేమిటి?"

''మన విషయాలు కొన్ని ఆవిడకి నేను వుత్తరాల్లో వ్రాశాను."

"మన విషయాలంటే?" నుదురు చిట్లిస్తూ అడిగాడు.

"అన్నీ. మీరు ఆవిడ వుత్తరాలు చదవండి. మామూలు సంఘటనల్ని ఎంత అందంగా మార్చగలదో మీకే తెస్తుంది."

అరుణ కాఫీకప్పు టేబిల్‌మీద పెట్టి వెళ్ళి బీరువాలో చీరెల మడతల క్రింద పెట్టిన వుత్తరాల బొత్తి తెచ్చి యిచ్చింది.

చంద్రం తెల్లబోయి చూస్తున్నాడు. రోజుకి కనీసం ఒకసారయినా అతను బీరువా తెరుస్తాడు. కానీ అదే అల్మైరాలో అక్కడ తనకు తెలియని సంగతి ఒకటుంటూవుందని కల్లోకూడా వూహించలేదు.

ఉత్తరాలు భర్త చేతికిచ్చి కిటికీ దగ్గిరగా వెళ్ళి నిలబడింది అరుణ. చంద్రం వుత్తరాలు చదువుతున్నాడు. మొదట అతని ముఖం చేదుతిన్నట్టు అప్రియంగావుంది. తర్వాత, తర్వాత రెండుమూడు వుత్తరాలు చదివేసరికి చెవులనుండి మెడ క్రిందవరకూ రక్తం చిందుతుందేమో అన్నంత ఎర్రగా కందగడ్డలా తయారైంది.

చేతిలోవున్న ఉత్తరాలని నలిసి దూరంగా విసిరేస్తూ లేచి నిలబడ్డాడు. "నువ్వు-నువ్వు, ఇవన్నీ వ్రాశావా? నీకు సిగ్గెలా లేకపోయింది?"

అరుణ నదరూబెదురూ లేకుండా జవాబు చెప్పింది. "సిగ్గెందుకు? ఆవిడ మహా రచయిత్రి. యింత అందమైన అనుభవాలు అవివాహిత ఆయిన ఆవిడ కెలా లభిస్తాయి. అందుకే నేను తోడ్పడ్డాను."


"నీకు బుద్ధిలేదు. ఛి-ఛీ-మనిద్దరికీ పరిమితం కావల్సిన విషయాలని మరో మనిషికి చెప్పేందుకు నీకు నోరెలా వచ్చింది? నీఅంత సిగ్గులేని స్త్రీ ప్రపంచంలో వుంటుందా?" నిలువెల్లా కంపరం పుట్టినట్టుగా వున్న చంద్రం భార్యదగ్గిరగా వచ్చాడు. అరుణ రెప్పవాల్చకుండా అతని వైపు చూస్తోంది. నిజంగా అదంతా బాధేనా! లేక అదికూడా మరో నటనా!

కోపంతో అడిగాడు చంద్రం. "అయినా నా కెందుకు చెప్పలేదు? ఏదయినా సరే చేసేముందు నాకు చెప్పాలని చెప్పలేదూ నీకు?"

ఏ మాత్రం తొణుకూ, బెణుకూ లేకుండా నిశ్చలంగా నిలబడిన భార్యని చూసేసరికి అతనికి పూర్తిగా శివమెత్తింది. చాలా రోజులనుంచి బలవంతంగా నిగ్రహించుకొంటున్న ఆగ్రహం ఒక్కసారి వేయి పడగలువిప్పి బుస్సుమని పైకి లేచింది.

అరుణ దగ్గిరగానిలబడి శాసిస్తున్నట్టుగా అన్నాడు: "ఈ పుస్తకం ప్రింట్ అవటానికి వీల్లేదు. వీల్లేదని ఆవిడకి టెలిగ్రాం యివ్వు. యిప్పుడే-యీ క్షణంలోనే." అంటూనే అరుణ చెయిపట్టి గుంజి డ్రాయర్ దగ్గిరకి లాక్కొచ్చాడు. డ్రాయర్ లాగి టెలిగ్రాంఫారమ్ తీసి తనే "డోంట్ పబ్లిష్ స్టాపిట్." అని వ్రాసి పెన్ అరుణ చేతిలో పెట్టి 'అడ్రస్ వ్రాయి' అన్నాడు. అరుణ నిశ్చలంగా వ్రాసింది.

చంద్రం టెలిగ్రాం తీసుకుని అప్పటికప్పుడే పోస్టాఫీస్‌కి వెళ్ళాడు. అతను కనుమరుగైన క్షణంలోనే అరుణ మరో ఫారమ్ తీసుకుని 'సంయుక్తా! స్టార్ట్ యిమిడీయట్లీ వెరీ అర్జంట్.' అని వ్రాసి ప్రక్కింటికి పరిగెత్తి ఆయన తమ్ముణ్ణి పిలిపించి "ప్రసాద్! అర్జంట్‌గా ఈ టెలిగ్రాం యిచ్చిరా" అని పంపింది. పోస్టాఫీసునుంచి చంద్రం బైటికి వస్తుంటే, ప్రసాద్ లోపలికి వెళ్ళాడు. ఆ రాత్రి చంద్రం ఇంటికి రాలేదు. క్లబ్‌లోనే గడిపాడు.




* * *

సంయుక్త రైలు దిగి ప్లాట్‌ఫారంమీద పాదం ఆనించగానే అరుణ చెయి పట్టుకుంటూ ఆదుర్దాగా అడిగింది. "ఏమిటా టెలిగ్రాము? నీ కేమైనా మతిపోయిందా?"

"జరగబోయేది వింటే నీకే మతిపోతుంది." చిరునవ్వుతో అంది అరుణ.

"ఏమిటి? ఏమైం దసలు?"

"ఇంటికి పద చెబుతాను."

టాక్సీలో వస్తుండగా దోవలో చెప్పింది అరుణ. "మా శ్రీవారీ మధ్య మరీ బొత్తిగా పేచీమనిషి అయిపోతున్నారు. పుస్తకం ఆయన ముందు చదివితేగాని పబ్లిష్ చేయటానికి వీల్లేదట. అందులో ఆయన్నిగురించి నువ్వు ఏదో అసభ్యంగా వ్రాశావని ఆయన భయం."

"ఓస్. ఇంతేకదా! ఈ మాత్రానికి నన్ను రప్పించటం దేనికీ. అలాని వ్రాస్తే పుస్తకం పోస్టులో పంపించేదాన్నిగా!"

"ఉహూ. మధ్యలో మళ్ళీ ఆయన కేదయిన అనుమానం వస్తే నచ్చచెప్పటం నావల్లకాదు. అసలు చాలారోజులనుంచీ నిన్ను చూడాలని మనసులో ఆరాటంగా వుంది. అసలు కథ అది."

సంయుక్త నవ్వింది. "మరి అంత ఆదుర్దాగలమనిషి కనీసం స్టేషన్‌కయినా రాలేదేం?"

''వచ్చేవారే! స్నేహితుడికి ఒకతనికి ఒంట్లో బాగాలేదు. హాస్పిటల్‌లో చేర్పించటానికి తీసుకువెళ్ళారు."

ఇద్దరూ యింటికి వచ్చారు. పొందికగా, అందంగా, కళాత్మకంగా సర్దివున్న అరుణ యింటిని చూసి సంయుక్త ముచ్చటపడింది. ''ఏదీ ఎక్కడా మీ యిద్దరివీ ఒక్క ఫొటో అయినా లేదే?" యిల్లంతా కలియచూస్తూ అడిగింది.

అరుణ స్టేషన్‌కి వెళ్ళేముందే పడగ్గదిలో వున్న చంద్రంఫొటో తీసి లోపల పెట్టేసింది. ఇద్దరూకలిసి భోజనం చేశారు. ప్రయాణపు బడలికవల్ల సంయుక్త పడుకుని నిద్రపోయింది. అరుణ సంయుక్త చేతివ్రాతతోవున్న నవల తీసుకుని చదువుతూ కూర్చుంది. దాదాపు అంతా తన జీవితమే. బాబాయితో పోట్లాడటం, ఘర్షణపడి యింట్లోంచి బైటికి రావటం, వుద్యోగం దొరక్క నానాయాతనలకీ గురికావటం, చివరికిలాగా అందరూ మళ్ళీ ఏకం కావటం అదీ అసలు కథ. నవల మొత్తంమీద ప్రతి పేజీలో కల్పిస్తున్న కథానాయకుడి నిగ్రహానికీ, వ్యక్తిత్వానికీ, మనం ముగ్ధలవుతాం. ఒక్క ఇంజనీరింగ్ డిగ్రీతప్ప ఇంకేం లేని అతను, స్థితిమంతురాలైన పిల్లని పెళ్ళి చేసుకుని, అంతులేని దరిద్రంలో మునిగి తేలుతూకూడా వాటి ఛాయలేవీ భార్యకి అంటకుండా వుండాలని, భార్యని ఈ బురదలో కూరుకోకుండా ఎత్తిపట్టుకోవటానికి, అతడు పడే బాధలు, చేసే విశ్వ ప్రయత్నాలు హృదయానికి హత్తుకునేలా గంభీరమైన భాషతో, చక్కటి సన్నివేశాలతో నూతనసృష్టి చేసింది సంయుక్త. సమస్యలు పాతవే, బాధలు మామూలువే; కానీ వ్యక్తిత్వంగల వ్యక్తుల మధ్య వాటితో ఎంత కథ సృష్టించవచ్చునో సంయుక్త నేర్పుగా చూపించింది. పుస్తకం యావత్తూ చదివిన తర్వాత అరుణకి అన్పించింది; సంయుక్త కథానాయకుడివైపు కాస్త పక్షపాతమే చూపించింది. అందులో కథానాయిక భర్తపడే బాధలు చూస్తూ వూరుకోవటం తప్ప ఇంకేం చేయలేదు. అరుణకి కాస్త అసంతృప్తి కలిగింది.

సాయంత్రం అవుతుండగా లేచింది సంయుక్త. అరుణ అప్పటికే కాఫీ, టిఫిన్ రెడీచేసి లేవగానే అందించింది. సంయుక్త స్నానం చేసి బట్టలు మార్చుకుంటుండగా అరుణచేతిలో ప్లాస్టిక్ బాగ్‌తో గదిలోకి వచ్చి, 'పది నిముషాలు నువ్వు వంటరిగా యింట్లో వుండాలి. నే నిప్పుడు కూరలు తీసుకుని వస్తాను.'' అంది.

''ఒక్క నిముషం ఆగు, నేనూ వస్తాను." గబగబా జడ విప్పుకుంటూ అంది సంయుక్త. అరుణ వారించింది, ''ఉహుఁ, నువ్వొద్దు, నువ్వు జడవేసుకోవటం పూర్తయ్యేలోపల తిరిగి వచ్చేస్తాను."అంటూ బైటకి నడిచింది.

''త్వరగా రావాలి. లేకపోతే భయంతో చచ్చిపోతాను." సంయుక్త వెనకనుంచి కేకవేసింది.

"ఇది సిటీ తల్లీ! ప్రమాదాలవల్లా, ఆకలివల్లా తప్పితే వట్టి భయంతో చచ్చిపోయిన వాళ్ళ సంఖ్య చాలా స్వల్పం.'' నవ్వుతూనే చెయివూపింది అరుణ.

ఇంట్లోంచి బైటకివచ్చిన అరుణ మార్కెట్‌వైపుగా కాకుండా పక్కింటివైపు నడిచి వాళ్ళగుమ్మంలో నిలబడే 'తమ్ముడూ!' అని కేకపెట్టింది.

'ఆఁ, ఏంకావాలక్కయ్యా' అంటూ ప్రసాద్ బైటకి వచ్చాడు.

"నాకు చిన్న కాగితం, కలం కావాలి. నువ్వు నాతోకాస్త బస్‌స్టాండ్‌వరకూ సాయం రావాలి!"

ప్రసాద్ కాగితం కలం తెచ్చిచ్చాడు. అరుణ కాగితం గోడమీదపెట్టి వ్రాసింది. 'సారీ సంయుక్తా!

సిటీనుంచి వచ్చిన ఒకామె చెప్పింది. నా ఫ్రెండ్ కలిసిందిట. తను ఈరాత్రి ట్రెయిన్‌కే బొంబాయి వెళ్ళిపోతుందిట. నాలుగు సంవత్సరాలవరకూ తిరిగిరాదు. నేను కన్పించలేదని మరీమరీ అనుకుందట. ఇప్పుడు బైలుదేరబోయే బస్సుకి నేను వెడుతున్నాను. వీలుంటే రాత్రికి తప్పకుండా వస్తా, లేకపోతే రేపు వుదయం. మరేమీ అనుకోకు. మావారు యింటికి రాగానే యీ వుత్తరం చూపించు. వంట చేసి పెట్టాను. ఇద్దరూకలిసి భోజనం చేయండి.

వుంటాను.'

అరుణ వ్రాయటం పూర్తయేసరికి ప్రసాద్ బట్టలేసుకుని బైటకి వచ్చాడు.

అరుణ వచ్చేసరికి బస్సు కదలబోతోంది. చేతిలోవున్న కాగితం ప్రసాద్‌కిస్తూ 'ప్రసాద్ ఇది మా యింట్లో యిచ్చెయి. నన్ను బస్ ఎక్కించానని చెప్పు, వస్తాను.' అంటూ బస్ ఎక్కింది.

బస్ చెక్‌పోస్ట్ దాటి వచ్చేస్తుంటే అరుణ కళ్ళనిండా గిర్రున నీళ్ళు తిరిగాయి. ఏం చేసింది తను! ఆ పరిస్థితుల్లో మరొకరైతే మాత్రం ఏం చేస్తారు; బైటంతా చిక్కటి చీకటి ఆవరించుకుంది. అరుణ హృదయం కూడా అలాగే శూన్యంగా వుంది. నిన్న మొన్నటివరకూ మనసులో పవిత్రమైన దేవాలయం వుండేది. దానిలోవున్న చంద్రం విగ్రహానికి పూజలు సలుపటంలో రాత్రింబవళ్ళు ఎలా జరిగిపోయినాయో ధ్యాసేలేదు. హఠాత్తుగా భూకంపం వచ్చింది. ఆలయం కూలింది. విగ్రహం ముక్కలైపోయింది. అంతవరకూ దేవదాసిలా బ్రతుకుతున్న ఆంతర్యం చేష్ట లుడిగిపోయినట్టు రాయిలా మిగిలిపోయింది. చంద్రంలో తన కింతవరకూ గోచరంలేని మరోరూపం వుందని ఋజువు దొరికిననాడే అతని గురించిన అభిప్రాయం పునాదులలో కదిలింది. ఇన్నేళ్ళలో అతని సాహచర్యంలో తను పొందిన సుఖం, ఆత్మీయతలాటి వెనకనీడలా అతనికి మరోకాంక్ష వుందని తెలిసేసరికి పేలవంగా కన్పిస్తున్నాయి. వాటిని గుర్తుచేసుకుని ఆ బలంతోనైనా రాజీపడదామా అని ఎంత ప్రయత్నంచేసినా లొంగటంలేదు. ఆనాడు డబ్బుకోసము చూసిన చంద్రాన్ని ఏమనాలి. అందుకే ఆరోజు బాబాయికి

తను రాసిన ఉత్తరం పోస్ట్ చేయలేదు. అందుకే అంత అవమానాన్ని దిగమింగి శంకరంతో రాగానే బాగానే మాట్లాడాడేమో! ఏమో! ఏది నిజమో, ఏదిఅబద్ధమో తెలియని విచిత్ర పరిస్థితిగా ఉంది.

చంద్రం సంయుక్తకి వ్రాసిన ఉత్తరాలు గుర్తుకొస్తే కడుపులో దేవినట్టేవుంది.

అందుకే కాబోలు యిన్నాళ్ల ఈ దాంపత్య జీవితంలో ఒక్క రోజుకూడా అతను మాటలరూపంలో అభిమానం ఏనాడూ బైట పెట్టలేదు. అతని మౌనానికి తనే అందమైన రూపం కల్పించుకుని మురిసిపోయింది. వెనక్కి తొంగిచూసుకుంటే చంద్రం అంటీ ముట్టనట్టువున్న సంఘటనలు అనేకం కళ్ళ ముందు కదులుతున్నాయి. సంయుక్తకి అలాటి ప్రేమలేఖలు వ్రాసినవాడు, తన గుండెల్లో యిలా యిన్ని గులాబీలు పూయించినవాడు యిం కేదయినా చేయగలడు. ఎవరి మీదా అతనికి నిజమైన మమత లేదు. నిజానికి అతని కెవరూ సన్నిహితులు కారు.

రాత్రి పొద్దుపోయిన తర్వాత వచ్చి తలుపు తట్టి ఈ రాత్రికి యిక్కడే వుంటానన్న అరుణని చూసి జానకి ఆశ్చర్యపోయింది. ఎగాదిగా చూసింది. అరుణ వంటరిగా ఎప్పుడూ రాదు.

జానకి ఆశ్చర్యాన్ని గమనించిన అరుణ— ''స్నేహితురాలు ఒకమ్మాయిని పంపటానికి స్టేషన్‌కి వెళ్లాను. పొద్దుపోయింది—'' అంటూ నసిగింది.

“నీ సంజాయిషీలు నాకేం అవసరం లేదులే. రా లోపలికి. ఎన్నిసార్లు పిలిచినా రాని మనిషివి, హఠాత్తుగా కానిసమయంలో వచ్చి తలుపు తట్టేసరికి కాస్త ఆశ్చర్యం వేసింది,” అంది — లోపలికి పిలుస్తూ సంతోషంగా అంది జానకి.

రాకరాక వచ్చిన స్నేహితురాలికోసం అర్జంటుగా వంట మొదలుపెట్టబోతుంటే అరుణ అడ్డుపడి వారించేసింది.

ఆ రాత్రి పడుకున్నదన్నమాటే గాని కంటిమీదకి నిద్రే రాలేదు. అలా అని విపరీతమైన వేదనగాని, బాధగాని ఏమీ లేవు. మనసంతా భరించలేనంత శూన్యంగా వుంది. అర్ధరాత్రివేళ ఆ శూన్యంలోంచి ఒకవిధమైన నొప్పి మొదలై క్రమంగా గుండెలనిండా ఆవరించుకుంది.




తెల్లవారిన తర్వాత కాఫీకి పిలవటానికి స్నేహితురాలి గదిలోకి వచ్చిన జానకి తెల్లబోయింది. మంచానికి చేరబడి, గుండెలు పట్టుకుని నిర్జీవంగా, నలిగిపోయిన కలువ కాడలా వ్రేలాడిపోతూ కూర్చునివుంది అరుణ.

జానకి భర్తచేత చంద్రానికి కబురు చేయిస్తానంది. అరుణ వద్దంది.

ఆ రోజంతా అక్కడే గడిపింది. మర్నాడు సాయంత్రానికి జానకి తను కూడా వచ్చి దిగబెడతానన్నా వినకుండా ఒక్కత్తే బైలుదేరింది. “నా కప్పుడప్పుడూ యిలా వచ్చి పోతూంటుంది. అది అలవాటే. నువ్వేం ఖంగారుపడకు,” నవ్వు తెచ్చిపెట్టుకుంటూ చెప్పింది.

సాయంత్రం ఆరుగంట లవుతుండగా యిల్లు చేరుకుంటున్న అరుణకు వీధిలో గేటు బైటే కూర్చునివున్న పనిమనిషి ఎదురైంది. అది అరుణని చూడగానే ముఖం చాటంత చేసుకుని ఎదురొచ్చింది. అంతలోనే మహా విసుగ్గా ముఖంపెట్టి “రండమ్మగారూ! ఎప్పుడనగవచ్చి కూకున్నాను? అంతుపంతూ లేకుండా పోయారు. అయ్యగారేమో ఆఫీసుకువెళ్తూ ‘అమ్మ వచ్చేవరకూ యిక్కడే ఉండు, కదలకు’ అని చెప్పిపోయా,” రంది.

అరుణ తాళంతీసుకుగదిలోపలికి ప్రవేశించింది. సంయుక్త పెట్టి కన్పించలేదు. వెళ్ళిపోయిందేమో. వంటింట్లో ఆరోజు తను చేసినవి ఎలా మూతలు పెట్టిందో అలాగే ఉన్నాయి. అటువైపు ఎవరూ వచ్చిన జాడలేమీ లేవు.

పనిమనిషి గంటలా గణగణా వాగుతోంది. ''మొన్నరాత్రి — రాత్రి పొద్దోయింతర్వాత అయ్యగా రొచ్చి మావోడిని లేపి ‘ఇంటికి చుట్టా లొచ్చారు. అమ్మ యింట్లో లేరు. మీ దాన్ని పంపు పడుకోటానికి’ అంటే మావా డొచ్చి దింపిపోయినాడు. ఆ యమ్మ నాకోసం చూసింది. అయ్య కారేజ్‌లో భోజనం యింటికాడ యిచ్చి రమ్మని మావో డొచ్చి అన్నం యిచ్చిపోయిండు. సాయంత్రంవరకూ చూసి ఆ అమ్మ వెల్లిపోయింది. ఓలమ్మో! అయ్యో, నా మతిమండా — ఇదుగో, ఆ అమ్మ ఉత్తరం యిచ్చిపోయింది. నువ్వు రాగానే యిమ్మంది.” అంటూ చీర్లోని అల్లిక సంచి తీసి దానిలో తమలపాకులతో మడత పెట్టి పెట్టిన కాగితం తీసి యిచ్చింది. యిస్తూ, “అయ్యేమో ఆ అమ్మని పంపి రావటానికి ఎల్లినప్పుడే బీగం నా చేతికిచ్చి ‘నూకమ్మా! అమ్మొస్తుంది. యిదియ్యి. వచ్చేవరకూ ఏడకీ పోమాక’ అని సెప్పి పోయిండు. ఏం రావటం! చూసిచూసి కళ్ళు కాయలైనాయి. నడుం నీలుక్కుపోయింది.” నడుం సవరదీసుకుంటూ బాత్‌రూంవైపు వెడుతూ అంది.

అరుణ నీరసంగా కుర్చీలో కూలబడి వుత్తరం చదువుకుంది.

అరుణా!

ఎంతపని చేశావ్! మనిద్దరిమధ్యా ఏ రహస్యాలూ వుండకూడదని నేననుకుంటూ వుంటే నన్నిలా వంచించటం నీకు న్యాయమేనా? ఆనాడే చంద్రం ఎవరో నా కెందుకు చెప్పలేదు? పోనీ యింటికి తిరిగిరాగానే చంద్రాన్ని ఎందుకు నిలదీసి అడగలేదు? నాతో నీ పరిచయాన్ని గుప్తంగా వుంచినట్టు చంద్రం నన్ను చూసి తెల్లబోగానే అర్థం చేసుకున్నాను.

కూరలకోసం వెళ్ళిన నువ్వు యింటికి రాకుండా సిటీకి వెళుతున్నానని కుర్రానిచేత చీటీ పంపినప్పుడే నా కేదో అనుమానం వేసింది.

దానికి తగ్గట్టు అదేసమయంలో చంద్రం యింట్లో అడుగు పెట్టేసరికి తెల్లబోయాను. నే నున్నది వాస్తవమో లేక కలో అర్థం గాలేదు. ఇంచుమించు అతని పరిస్థితికూడా నాలాగే వుంది.

''సరసా! నువ్వా!'' అన్నాడు ఆశ్చర్యంగా.

"నువ్వా! అయితే అరుణ భర్త!" అయోమయంగా చూశాను నేను.

''ఐతే, సంయుక్త...'' అనుమానంగా ఆగిపోయా డతను.

తల వూపాను నేను.

చాలాసేపు ఇద్దరం మతి కోల్పోయిన వాళ్ళలా మౌనంగా వుండిపోయాం. ఆ నిశ్శబ్దంలో మా యిద్దరి మస్తిష్కాలలో నువ్వే మెదులుతున్నావు. ఫోటో చూపించి నప్పటినుంచీ జరిగిందంతా నెమరు వేసుకుంటున్నాడు. చంద్రం మెదడులో ఏ ఆలోచన సుళ్ళు తిరుగుతుందో నాకు తెలియదు. ఆలా ఎంతసే పుండిపోయామో తెలియదు.

వున్నట్టుండి అడిగాడు అతను ''నవల ఏది?''

యాంత్రికంగా యిచ్చాను. చంద్రం అగ్గిపుల్లగీసి దానికి అంటించాడు. కాలేవరకూ అలాగే చేతితో పట్టుకున్నాడు. తీక్షణంగా వెలుగుతున్న ఆ మంటలో రాయికంటే కఠినంగా వున్న అతని ముఖం చూసేసరికి, అతన్ని వారించాలన్నా భయం వేసింది. అంతేకాదు తదేకంగా అతనివైపు చూసిన నేను మరొకటికూడా గుర్తించాను. నే నెరిగిన చంద్రం కాదు యితను. నాకు వుత్తరాలు వ్రాసిన ఆ ప్రేమాభిమానికి, పాషాణంలా నిలబడిన యీ వ్యక్తికి పోలికే లేదు.

తర్వాత అత నేం మాట్లాడలేదు. ఇంట్లోంచి బైటకి వెళ్ళిపోయాడు. అరగంట తర్వాత మీ పనిమనిషి వచ్చింది. నాకు తోడుగా వుండటానికి అయ్యగారు పంపించారని చెప్పింది.

నీ రాకకోసం ఈ మధ్యాహ్నంవరకూ ఎదురుచూశాను. ఇదంతా ముఖాముఖిని నీతో చెప్పాలని నా ఆరాటం. నువ్వు రాలేదు. మీ ఆయన మళ్ళీ నా ముఖం చూడలేదు. మధ్యాహ్నము మీ పనిమనిషి మొగుడుద్వారా భోజనము పంపించాడు. వానిచేతనే సాయంత్రం వెళ్ళిపోతానని కబురుచేశాను. సాయంత్రం వచ్చాడు. అతనికే మొదట యీ ఉత్తరం యిద్దామనుకున్నాను. కానీ ఆ ముఖం చూసేసరికి ఇదికూడా రాత్రి నా కమలకి పట్టిన గతే పడుతుందేమో ననే అనుమానంవెసి పనిమనిషి కిస్తున్నాను. అది భద్రంగా నాకు చేర్చగలందులకు దానికి ఒకరూపాయి లంచంకూడా పెడుతున్నాను.

వెళ్ళేముందు ఒకమాట చెప్పకుండా వుండలేను. చల్లగా వున్న నీ సంసారం నావల్ల విచ్ఛిన్నమైం దనే అపనింద నాకు రానివ్వకు. ఈ సంఘటనవల్ల మన స్నేహానికి ఎలాటి అడ్డంకూ రానివ్వకూడదు. చంద్రాన్ని మళ్ళీ నా కీ విధంగా చూసి నువ్వు ఒకరకంగా నాకు తీరని అన్యాయం చేశాను. ఇప్పుడు నా వూహల్లో నేను సృష్టించుకున్న మూర్తి చెదిరిపోయింది. మరోదానికి ప్రాణం పోయాలంటే ఎంత అనుభవం కావాలో ఎంత కష్టమో నాకు తెలుసు. ఆంధ్ర పాఠకలోకానికి నువ్వు చెయ్యకూడని అన్యాయం చేశావు. ఇకనుంచీ నా కథలు వేరుగా వుంటాయి. నా వ్యాసాల్లోగానీ, వుపన్యాసాల్లోగానీ అవికూడా సమస్యాపూరితా లయిపోతాయి. ఇకనుంచీ నా కథలో స్త్రీపక్షపాతంగానే వుంటాయి. ఇదీ ఒకరకంగా నయమే! ఇకనుంచి నేను నిజజీవితానికి దగ్గరగా వ్రాస్తాను.

అరుణా! నేను వెళ్ళిన తర్వాత మీ యిద్దరూ ఏమౌతారు అనేది నా వూహకి అందటంలేదు. నీ వుత్తరంకోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తూంటాను.

నిజాన్ని నిర్మొహమాటంగా చెప్పేస్తున్నా! ఇన్నాళ్ళూ చంద్రం నా వూహామూర్తి అని భ్రమిస్తాను. లేదు, నా వూహామూర్తి పోలికలు కొన్ని చంద్రంలో వున్నాయని అనుకున్నాను. అతను నా కందలేదు కాబట్టి నా వూహాలకి మరింత బలం వచ్చింది. నా ఆరాధన రెట్టింపయింది. అతను నేను ఆశించినట్టు నాకు దగ్గరే వుంటే మిగతా స్నేహితులు విశ్వం, మూర్తి, ప్రభాకర్ వాళ్ళలాగానే అతనంటే అప్పుడే ఆసక్తి చచ్చిపోయేదేమో? నీ కేదయినా బాధ కలిగిస్తే క్షమించమని మనస్ఫూర్తిగా అడుగుతూ శలవు తీసుకుంటున్నాను.

త్వరలో నీనుంచి రాబోయే వుత్తరం కోసం అనుక్షణం ఎదురు చూస్తూంటానన్న సంగతి మర్చిపోకు. అతిథిమర్యాద సరిగ్గా జరక్కపోయినా భరించగలను. కానీ ఆశాభంగం సహించలేను.

వుంటాను,

సంయుక్త.

పనిమనిషి యిల్లంతా సర్ది - వూడ్చి వెళ్ళిపోయి చాలాసేపయింది.

అరుణ లేచివెళ్ళి గదిలో సూట్‌కేసు సర్దుకుంటుండగా వీధి తలుపు తెరిచిన ధ్వని, ఆవెంటనే పరిచితమైన అడుగుల చప్పుడి విన్పించింది. నీరసంగావున్న అరుణ గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. వణుకుతున్న కాళ్ళతో, క్రిందపెదవిని పై



పెదవితో నొక్కిపట్టి శబ్దం గమనించని దానిలా వూరుకుంది.

చంద్రం వెనగ్గావచ్చి నిలబడ్డాడు.

అరుణ ఏమీ ఎరుగనట్టు చీరెలు పెడుతోంది.

"ఎక్కడికెళ్ళావ్ ?''

అరుణ సమాధానం చెప్పలేదు.

కొంచం ఆగి మళ్ళీ అడిగాడు. ''ఎక్కడికెళుతున్నావు ?''

దానికే జవాబు రాలేదు.

''వెళ్ళదల్చుకున్నదానివి మళ్ళీ ఎందుకు వచ్చావు ? కబురుచేస్తే నీసామాను ఎవరితోనైనా నేనే పంపేవాడినిగా;'' తుఫాను ముందు కలిగే అశాంతత కన్పించింది అతని కంఠంలో.

''మీకు చెప్పివెళ్ళటానికి వచ్చాను."

"నాయిష్టంలేందే నాయింట్లోంచి వెళ్ళటం ఎవరితరం కాదన్న సంగతి నువ్వు త్వరలోనే గ్రహిస్తావు.''

''బలవంతంగా ఎవర్నీ ఎవరూ ఆపలేరు." రాబోతున్న ఏడుపుని బిగబట్టుకుంటూ అంది అరుణ.

"మూర్ఖులైన వాళ్ళచేత ఏపనయినా బలవంతంగానే చేయించాల్సివస్తుంది.''

"ఔను. నేను మూర్ఖురాలినే !"

"ఒట్టి మూర్ఖురాలివేనా ! పరమ మూర్ఖ

రాలివి. ఇన్నాళ్ళూ నువ్వేదో తెలివిగల దానివని మోసపోయాను నేను."

"నయమే. ఇప్పటికైనా అసలు విషయము తెల్సుకో గలిగారు.''

చంద్రం చెయి హఠాత్తుగా అరుణ భుజం మీదపడి చటుక్కున తనవైపు తిప్పుకుంది.

"సంయుక్త ఎవరో ముందే నాకెందుకు చెప్పలేదు నువ్వు;" తీక్షణంగా అడిగాడు.

"సరస అనే అమ్మాయి మీజీవితంలో వుందని మీరు నానుంచి ఎందుకు దాచారు ?'' రోషంగా ఎదురుప్రశ్న వేసింది అరుణ.

''నువ్వు రాకముందే ఆ అమ్మాయిని గురించిన జ్ఞాపకం శిథిలమైపోయింది." క్షణం ఆగి శాంతంగా అడిగాడు, "నేను తనకు వ్రాసిన వుత్తరాలు చూపించిందా ?"

''చూపించింది.''

"నా కెందుకు చెప్పలేదు."

"చెబితే ఏం చేసేవారు ?''

"వివరంగా నీకన్నీ విప్పిచెప్పేవాడిని."

''ఏం చెప్పేవారు ? మీరు అమాయకులని, పొరపా టయిందని -''

"కాదు. ఒకరోజున సరస అనే అమ్మాయిని నిండుమనసుతో ఆరాధించిన మాట నిజమేననీ, సరస నాకు పంచియిచ్చిన ఆత్మీయతలాటివే నా ఒక్కడికే కాక నాతోపాటు విశ్వానికీ, ప్రభాకర్‌కీ కూడా యిచ్చిందనీ, వాళ్ళుకూడా నాలాగే సన్నిహితంగా వుత్తరాలు వ్రాస్తారని తెలుసుకున్న రోజున నాక్షోభకి అంతులేదనీ, ఆ క్షణం లోనే సరస నాకు వ్రాసిన వుత్తరాలు తీసుకెళ్ళి ముఖంమీద గిరాటువేసి వచ్చేశాను కానీ, అ వచ్చేటప్పుడు నా వుత్తరాలు అడిగి తెచ్చుకోవాలనే ధ్యాసే నాకు లేక పోయిందనీ చెప్పేవాడిని. తర్వాత సరసకీ, నాకూ వుత్తరప్రత్యుత్తరా లేమీ జరగలేదు. ఏ వస్తువయినాసరే తనకి అందనిదాన్ని గురించి ఆరాటపడి, ఆవేదన చెందటం సరసకున్న ఒక చెడ్డ అలవాటు. కాబట్టే దాన్ని అనుసరించే అందని నా కోసం వూహలో ఆకాశంలోకి ఎత్తిందని, చేరువగా రావాలని విశ్వప్రయత్నం చేసిన విశ్వాన్నీ ప్రభాకర్‌నీ తృణీకరించి కడ్డిపోచల్లా హీనంగా చూసిందని నీకు తెలియచేసేవాడిని. ఇది జరిగినప్పుడంతా నువ్వెవరో నాకు తెలియనే తెలియదు. ఇది జరిగిపోయిన చాలాకాలానికి, దాదాపు నేనే యిదంతా మర్చిపోతున్న సమయంలో నువ్వు పరిచయం అయావు. నీతో స్నేహం అభివృద్ధి చెందినకొద్దీ ఈ జన్మలో పెళ్ళి చేసుకోకూడదు అనే నా గట్టిపట్టు, దానంతట అదే సడిలిపోయిందనీ, దానికి తర్వాత నేనెన్నడూ విచారించలేదనీ, యికముందు విచారించబోవటంలేదనీకూడా చెప్పేవాడిని.''

అరుణ అసహ్యంగా చూసి కంపరంగా చెయ్యి విదిలించుకుంది.

నిర్లక్ష్యంగా నిర్మొహమాటంగా చెప్పేసింది; ''అవన్నీ మీరు నాకేం ఏకరువు పెట్టనవసరంలేదు. నేను కోరుతున్నది మీ నుంచి సంజాయిషీ కాదు; వెళ్ళటానికి అనుమతి."

హతాశుడైనట్టు చూశాడు చంద్రం; అతని ముఖంలో గబగబా రంగులు మారాయి.

చివరికి మొండిగా తేల్చి చెప్పాడు; ''నేను నీకు యివ్వదల్చుకుంది సంజాయిషీ మాత్రమే! నా అనుమతిలేందే నువ్వీ యింట్లోంచి వెళ్ళలేకపోతే వుండిపోవాల్సిందే. తెలిసో తెలియకో నీ జీవితంతో నన్ను ముడేసుకున్నావు. ఆ ముడి విప్పటం యిక నీకు చేతకాదు. ఒకవేళ నువ్వు విప్పగలిగినా నేను విప్పనివ్వను. నీ యిష్టాయిష్టాలతో పని నాకులేదు. నువ్వీయింట్లో వుండి తీరాల్సిందే." అంటూనే చటుక్కున వెనుక్కుతిరిగి గదిలోంచి బైటికి వెళ్ళిపోయాడు. మరునిముషంలో వీధితలుపు తెరవటం మళ్ళీ ధడాల్న మూయటం విన్పించింది. అరుణ నిలబడినచోటే నిశ్చేష్టురాలైపోయింది.

ఆ రోజురాత్రి అతను యింటికి రాలేదు. మర్నాడు వుదయంకూడా జాడ తెలీలేదు. ఆఫీసుకి కబురుచేస్తే రాలేదన్నారు. అరుణకి ఏం చెయ్యటానికీ పాలుపోలేదు. మధ్యాహ్నం అంతా గడిచింది. అరుణ ప్రయాణానికి సిద్ధం అయింది. చంద్రం వచ్చినా రాకపోయినా వెళ్ళిపోటానికే నిశ్చయించుకుంది.

మూడుగంటలు దాటుతుండగా ఆఫీసు బాయ్ కవరు ఒకటి తెచ్చి, "అయ్యగారు యిచ్చిరమ్మన్నారు,'' అంటూ ఇచ్చి వెళ్ళిపోయాడు.

కవరులో కొంతడబ్బు, ఒక వుత్తరం, రైల్వేటికెట్ వున్నాయి.

గుండెలు పిండుతున్నట్టుగా వుండే బాధ పడేహృదయాన్ని మెలితిప్పుతుండగా అరుణ వుత్తరం తీసి చదువుకుంది. చంద్రం వ్రాశాడు :

రాత్రంతా ఆలోచించాను. మనసులు విరిగిన తర్వాత మాటలతో ప్రయోజనం లేదని నిన్న నీ ముఖం చూడగానే అనుకున్నాను. అయినా నీకు నచ్చచెప్పాలని ఓపికతో ప్రయత్నించాను. ఫలించలేదు. నువ్వు సాధారణంగా చప్పున త్వరపడి ఒక నిర్ణయానికి రావనీ, ఒక నిర్ణయానికి రావటం అంటూ జరిగితే దానికి తిరుగు లేదనీ నాకు తెలుసు. నీ పట్టువల నే నెరుగనిదికాదు. నీలో ఆ మొండితనమే లేకపోతే ఆనాడు మీ బాబాయ్‌ని ఎదురించి నాభార్యవి అయేదానివేకాదు. నువ్వు వెళ్ళటానికే నిశ్చయించుకున్నావని తెలుసు. నిన్న 'నువ్వు నాయింట్లో వుండితీరాల్సిందే' అని నేను అన్నమాట నిజమే. కానీ అది కేవలం ఆవేశంతో, అహంకారంతో అన్న మాటగా నువ్వు అనుకుంటావు. మనిషి అన్నతర్వాత ప్రతివాళ్ళకీ ఒక వ్యక్తిత్వం వుండాలి. ఆ వ్యక్తిత్వం పటిష్ఠంగాకూడా వుండాలి. మధ్యాహ్నంవరకూ ఆలోచించాను. నిన్ను బలవంతంగా వుంచి బాధపెట్టగలిగేశక్తి నాకు లేదు అని తేలిపో

యింది. అందుకే టికెట్ రిజర్వ్ చేయించి పంపుతున్నాను. శంకరానికి నువ్వీ రాత్రికి బైలుదేరి వస్తున్నట్టుగా టెలిగ్రాం ఇచ్చాను.

కానీ వెళ్ళేముందు ఒకటిమాత్రం బాగా గుర్తుంచుకో. నువ్వు నా జీవితంలో ప్రవేశించిన తర్వాత జరిగిన ప్రతిక్షణంనుంచీ నువ్వేది అడిగినా నేను ప్రతిదానికీ సమాధానం చెప్పగలను. నువ్వు రాకముందు, నువ్వెవరో నాకు తెలియకముందు, నాకు జరిగిన కొన్ని అనుభవాలు ఎందుకు జరిగాయంటే జవాబు చెప్పలేను. వాటివల్ల నీకు అన్యాయం జరిగిందంటే అసలే ఒప్పుకోను.

ఎప్పటికైనా నువ్వు నా దగ్గిరికి తిరిగి రాదల్చుకుంటే నాకేమీ అభ్యంతరంలేదు. నేనుకూడా నాలుగైదురోజుల్లో ఈ వూరు విడిచి వెళ్ళిపోబోతున్నాను. నేనెక్కడ ఉన్నదీ ఎప్పటికప్పుడు శంకరానికి తెలియజేస్తూవుండటం మర్చిపోను. ఇంతకంటే చెప్పాల్సింది యింకేమీ నాకు కన్పించటం లేదు. అందుకే ముగిస్తున్నాను.'' పైన సంబోధనగాని, క్రింద సంతకంగాని లేని ఆ వుత్తరాన్ని అరుణ ఒకటికి నాలుగుసార్లు చదువుకుంది.

* * *

రాత్రి చాలా పొద్దుపోయింది. వూరంతా మాటు మణిగింది. చంద్రం విపరీతమైన అలసటతో, గుండెలనిండా చీకటితో, కొద్దిగా తూలుతూ యింటికివచ్చాడు. ఇంటికి తాళం వేసివుందీ, గడియే వేసివుందీ, లేక అది బార్లా తెరిచివుందీ, తనెలా దానిగుండా లోపలికి వచ్చాడో అతనికి ధ్యాసేలేదు. ముందుగదిలో లైటు వేసి అక్కడే టేబిల్ పక్కగా వున్న పడక్కుర్చీ కన్పించగానే ఉస్సురంటూ అందులో కూలబడిపోయాడు. బట్టలు మార్చుకునే ఓపికకూడా అతనికి లేదు. వెనక్కి ఆనుకుని పడుకోబోతున్న అతనికి ఎదురుగుండా టేబిల్ మీద టికెట్ ఏదో రెండుముక్కలుగా కన్పించింది. ముందు కొద్దిసేపు – అదేదో తనవూహే తనని ఆడిస్తోందేమోనని – భయపడ్డాడు. తర్వాత మెల్లగా చేత్తో తాకి చూసి పెట్టేశాడు. మళ్ళీ చూశాడు. నిజంగానే రైలు టికెట్ రెండుగా చిరిగిపోయింది. ఎవరు చించారు? అరుణ ఎలా వెళ్ళింది? హఠాత్తుగా అతనికి గుర్తుకొచ్చింది. "అరుణా!" గావుకేక పెట్టాడు.

పిలుపుతో యిల్లు ప్రతిధ్వనించింది. కానీ జవాబుమాత్రం ఏమూలనుంచీ రాలేదు.

"అరుణా!'' పిలుస్తూనే, లేచి తడబడుతున్న అడుగులతో లోపలికి వెళ్ళాడు. పడగ్గదిలో అరుణ వుంది. కానీ అతని పిలుపు వినికూడా యిటు తిరగలేదు. నిద్రలో కూరుకుపోతున్న కళ్ళని బలవంతంగా తెరచి చూశాడు. మంచందగ్గర యిటువైపు వీపుపెట్టి నిలబడింది నిజంగా అరుణేనా! మళ్ళీ అతనికి అనుమానం వచ్చింది. దగ్గరగా వెళ్ళి భుజాలమీద చేతులు వేసి మెల్లగా తనవైపు తిప్పుకున్నాడు. అరుణ కళ్ళనుండి నీళ్ళ ధారలు కడుతున్నాయి. అది చూసి చిరునవ్వుతో, మడతపడుతున్న నాలికతో ముద్దుగా అన్నాడు. ''నిజమైన అరుణవే. బొమ్మ అయితే ఏడవదుగా!''

అప్పటికి పది నిముషాలనుంచీ అతని వాలకం పసిగట్టిన అరుణకి యిక ఏడుపు ఆగలేదు. అతని గుండెలో తల దాచుకుని ఒక్కసారిగా బావురుమంది. చంద్రానికి కూడా ఏడుపు వచ్చినంత పనైంది. కానీ ఎలాగో నిగ్రహించుకుని అరుణ చెంపలు నిమురుతూ అన్నాడు: "ఏడుస్తున్నావెందుకు? టికెట్ చిరిగిపోయిందనా? ఫర్వాలేదులే. రేపు యింకోటి తెప్పించియిస్తాను.''

"నాకేమీ అవసరంలేదు. నేనెక్కడికీ వెళ్ళను." తల అడ్డంగాతిప్పుతూ వెక్కిళ్ళ మధ్య గట్టిగా చెప్పేసింది అరుణ.

